తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | గురువారం-23-అక్టోబర్-2025 | సంపుటి:3 | సంచిక:145 | పేజీలు:8 | వెల: రూ.5 | www.telanganamuchatlu.in


# రాష్ట్రవ్యాప్తంగా చెక్ పోస్టులు రద్దు



- తెలంగాణలో తక్షణమే రవాణా చెక్ పోస్టులు మూసివేత
- బోర్డులు, బారికేడ్లు తొలగింపుకు ఆదేశం
- రికార్డులు, సామగ్రి తరలింపు
- సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

హైదరాబాద్, అక్టోబర్ 22(తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ రాష్ట్రంలోని రవాణా శాఖకు సంబంధించిన అన్ని చెక్ పోస్టులను తక్షణం మూసివేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రవాణా కమిషనర్ జిల్లా రవాణా అధికారులకు (డీటీఓ) ఈ మేరకు ఉత్తర్వులు విడుదల చేశారు. ప్రభుత్వ ఈ నిర్ణయం రాష్ట్రవ్యాప్తంగా రవాణా వ్యవస్థలో వేగం పెంచేందుకు, అవినీతిని అరికట్టేందుకు తీసుకున్న ముఖ్యమైన చర్యగా భావిస్తున్నారు.

మిగతా 2లో..



## జర్నలిస్టులకు కేటాయించిన భూమిని కాపాడిన హైడ్రా

- 38 ఎకరాలకు కంచె నిర్మాణం
- పేట్‌బషీరాబాద్‌లో భూమి ఆక్రమణలపై చర్యలు
- ఆక్రమణలపై ఫిర్యాదు, క్షేత్రస్థాయి పరిశీలన
- త్వరలో నివాసితులతో కమిషనర్ సమావేశం

హైదరాబాద్, అక్టోబర్ 22(తెలంగాణ ముచ్చట్లు)

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం పేట్‌బషీరాబాద్‌లో జర్నలిస్టులకు కేటాయించిన 38 ఎకరాల ప్రభుత్వ భూమిని హైదరాబాద్ డెవలప్‌మెంట్ అథారిటీ రక్షించింది. సర్వే నంబర్ 25/2 లోని ఈ భూమి చుట్టూ బుధవారం హైడ్రా అధికారులు ఫెన్సింగ్ (కంచె) నిర్మించారు.

మిగతా 2లో..



## నవీన్ యాదవ్ గెలుపునకు వ్యూహం

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష
- యూసుఫ్ గూడా డివిజన్ నేతలతో సమావేశం

హైదరాబాద్, అక్టోబర్ 22(తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ రాష్ట్ర మంత్రి మరియు కాంగ్రెస్ నాయకులు పొన్నం ప్రభాకర్, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసుఫ్ గూడా డివిజన్ ఇంచార్జీలు మరియు ముఖ్య నేతలతో బుధవారం కీలక సమావేశం నిర్వహించారు. రాబోయే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ విషయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ తన అధికారిక 'ఎక్స్' (గతంలో ట్విట్టర్) ఖాతా ద్వారా వెల్లడిరచారు.

మిగతా 2లో..



## కాంగ్రెస్ పాలనలో అన్నదాతలు అరిగోస

- మక్క కొనుగోళ్లపై కవిత విమర్శలు
- మక్క కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయని ప్రభుత్వం
- రైతు భరోసా, రుణమాఫీ ఎగ్గొట్టిన ప్రభుత్వం
- కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, అక్టోబర్ 22(తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓట్లేసిన పాపానికి అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ముఖ్యంగా, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వం మక్క కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

మిగతా 2లో..



## చెక్ పోస్టుల రద్దు, ఆన్‌లైన్ వ్యవస్థ అమలు

- తెలంగాణలో రవాణా చెక్ పోస్టులు రద్దు
- ఈవీ పాలసీ ద్వారా పర్యావరణ పరిరక్షణ
- మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, అక్టోబర్ 22(తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ రాష్ట్రంలో రవాణా శాఖకు సంబంధించిన చెక్ పోస్టుల రద్దు నిర్ణయం ఈ రోజు (బుధవారం) నుండి అమలులోకి వచ్చింది. ఈ మేరకు ప్రభుత్వం జీవో (%Gూ%) జారీ చేసింది. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు, అలాగే రవాణా ప్రక్రియలన్నీ పారదర్శకంగా ఆన్‌లైన్‌లో జరిగేలా చూసేందుకు రెండు నెలల క్రితమే ఈ నిర్ణయం తీసుకొని, ఇప్పుడు పూర్తిగా చెక్ పోస్టులను మూసివేస్తూ అమలు చేస్తున్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

మిగతా 2లో..

# ఆసుపత్రుల నిర్మాణంపై సీఎం ఉన్నతస్థాయి సమీక్ష



- గడువులోగా పూర్తి చేయాలని కఠిన ఆదేశాలు
- రాష్ట్రంలో వైద్య మౌలిక సదుపాయాలపై ఉన్నతస్థాయి సమీక్ష
- నిర్మాణ పనుల పూర్తికి గడువుల నిర్దేశం
- పర్యవేక్షణకు ప్రత్యేక అధికారుల నియామకం

హైదరాబాద్, అక్టోబర్ 22(తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఆరోగ్య రంగ మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా, నయా ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణంతో పాటు, రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో శరవేగంగా నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులు మరియు కొత్త వైద్య కళాశాలల పనుల పురోగతిపై ఆయన బుధవారం ఉన్నతాధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో చేపట్టిన ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులన్నీ వేగవంతంగా పూర్తి చేయాల్సిన ఆవశ్యకతను ముఖ్యమంత్రి ఈ సమావేశంలో నొక్కి చెప్పారు.

మిగతా 2లో..



## జూ. ఎన్టీఆర్ మార్ఫింగ్ ఫొటోలపై సీపీ సజ్జనార్‌కు అభిమానుల ఫిర్యాదు

### పరువును దెబ్బతీసేలా పోస్టులు


హైదరాబాద్, అక్టోబర్ 22(తెలంగాణ ముచ్చట్లు)

ప్రముఖ తెలుగు నటుడు జూనియర్ ఎన్టీఆర్ ఫొటోలను మార్ఫింగ్ చేస్తూ, ఆయన వ్యక్తిగత ప్రతిష్ఠను, పరువును దెబ్బతీసేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారంటూ ఎన్టీఆర్ అభిమానులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అభిమానుల సంఘం నాయకుడు నందిపాటి మురళి బుధవారం హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు.

మిగతా 2లో..

## మైనర్ బాలికపై అత్యాచారం : పోక్సో కోర్టు సంచలన తీర్పు

2లో



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# రాష్ట్రవ్యాప్తంగా చెక్ పోస్టులు రద్దు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రవ్యాప్తంగా డీటీఓలు స్వయంగా చెక్ పోస్టుల వద్ద ప్రస్తుతం ఉన్న బోర్డులను, బారికేడ్లను తొలగించే కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని రవాణా కమిషనర్ ఆదేశాల్లో స్పష్టం చేశారు. చెక్ పోస్టులు మూసి వేయబడినట్టుగా కొత్త బోర్డులను ఏర్పాటు చేయాలని డీటీఓలకు సూచించారు. చెక్ పోస్టుల వద్ద విధుల్లో ఉన్న సిబ్బందిని ఎవరూ లేకుండా తక్షణమే ఉపసంహరించాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో చెక్ పోస్టులను సూచిస్తూ ఉన్న బోర్డులు, బారికేడ్లను వెంటనే తొలగించాలని డీటీఓలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ తొలగింపు ప్రక్రియను మొత్తం వీడియో తీసి దాన్ని భద్రపరచాలని డీటీఓలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పారదర్శకతను పాటించే ఉద్దేశంతో ఈ చర్య తీసుకున్నట్లు తెలుస్తోంది.

చెక్ పోస్టుల వద్ద ఉన్న రికార్డులు, ఫర్నీచర్, ఇతర సామగ్రి, కంప్యూటర్లు, ఇతర వస్తువులను తక్షణం డీటీఓ కార్యాలయాలకు తరలించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. అదేవిధంగా, పరిపాలనకు సంబంధించిన రికార్డులు, క్యాష్ బుక్స్, రిసిప్టులు, చాలాన్లను అన్నింటినీ డీటీవో కార్యాలయంలో భద్రపరచాలని సూచించారు. ఇంతకాలం చెక్ పోస్టులు నిర్వహించిన స్థలాల్లో వాహనాల రాకపోకలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని రవాణా కమిషనర్ స్పష్టంగా పేర్కొన్నారు. చెక్ పోస్టులను మూసివేసినట్టుగా, సిబ్బందిని తిరిగి నియమించినట్టుగా (రీడిప్లాయ్ చేసినట్టు), రికార్డులను భద్రపరిచిన విషయాలన్నింటిపైనా ఈరోజు సాయంత్రం 5 గంటలలోపు నివేదిక అందించాలని డీటీఓలను ఆదేశిస్తూ రవాణా శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

# జర్నలిస్టులకు కేటాయించిన భూమిని కాపాడిన హైడ్రా

(మొదటి పేజీ తరువాయి)

ఈ భూమిని గతంలో, అంటే 2008లో, జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. అప్పటి నుంచి ఈ భూమి హెచ్‌ఎండీఏ కస్టడీలో ఉంది.

ఆక్రమణలపై ఫిర్యాదు, క్షేత్రస్థాయి పరిశీలన

ఈ భూమి కేటాయింపులపై కొందరు కోర్టును ఆశ్రయించడంతో ప్లాట్ల పంపిణీ జరగలేదు. కోర్టు వివాదం కొనసాగుతుండగానే, భూమిలో ఆక్రమణలు జరుగుతున్నాయని %జీజీజీవీఏజనూ% ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ మరియు హెచ్‌ఎండీఏ అధికారులు కూడా ఇదే విషయాన్ని హైడ్రా దృష్టికి తీసుకొచ్చారు. ఈ ఫిర్యాదుల మేరకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు రెవెన్యూ, మున్సిపల్, హెచ్‌ఎండీఏ అధికారులతో కలిసి హైడ్రా క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. ఈ పరిశీలనలో ఆక్రమణలు జరిగినట్టు నిర్ధారించుకుంది.

ఖాళీ భూమికి రక్షణ, ఆక్రమణదారులకు స్పష్టత

ఆక్రమణలు నిర్ధారించినప్పటికీ, ఇప్పటికే కొంతమంది ఇళ్లు కట్టుకుని నివాసం ఉంటున్న వాటి జోలికి పోకుండా, ఇంకా ఖాళీగా ఉన్న భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. ఈ చర్యపై కొంతమంది అభ్యంతరాలు వ్యక్తం చేయగా, కోర్టు తీర్పు ప్రకారం ఆ స్థలం కేటాయింపులు జరుగుతాయని, ఈ లోగా అక్రమణలు జరగకుండా ప్రభుత్వ భూమిని కాపాడుతున్నట్టు హైడ్రా స్పష్టం చేసింది.

అలాగే, అక్కడ ఇల్లు కట్టుకుని నివాసం ఉంటున్న వారితో త్వరలోనే ఒక సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. ఈ సమావేశంలో పూర్తి స్థాయిలో రికార్డులను పరిశీలిస్తామని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో హైడ్రా, రెవెన్యూ, హెచ్‌ఎండీఏ, మున్సిపల్ అధికారులు కూడా పాల్గొంటారని కమిషనర్ వివరించారు. ఈ చర్య ద్వారా ప్రభుత్వం ఆస్తుల రక్షణకు కట్టుబడి ఉందని హైడ్రా స్పష్టం చేసింది.

# నవీన్ యాదవ్ గెలుపునకు వ్యూహం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సమావేశంలో మంత్రి ప్రభాకర్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయానికి క్యాడర్ అంతా ఐక్యంగా పనిచేసేలా దిశా నిర్దేశం చేశారు. ఉప ఎన్నికల్లో ప్రచారాన్ని మరింత వేగవంతం చేసేలా కార్యాచరణను రూపొందించడంపై నేతలతో చర్చించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు మరియు అభివృద్ధి పనులను జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఇంటింటికి తీసుకెళ్లేలా వ్యూహాన్ని ఖరారు చేశారు.

ఓటింగ్ శాతం పెంపుపై ప్రత్యేక దృష్టి

ఎన్నికల రోజు ఓటరును ఓటింగ్ కేంద్రానికి తీసుకొచ్చేలా బూత్ ఇన్‌చార్జ్‌లు తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి వివరణాత్మక దిశా నిర్దేశం చేశారు. ఓటింగ్ శాతాన్ని పెంచి, యూసుఫ్ గూడా డివిజన్ పరిధిలో భారీ మెజారిటీ వచ్చేలా కృషి చేయాలని ఆయన సూచించారు. ఇందుకోసం ప్రతి ఓటరును వ్యక్తిగతంగా కలిసి విజ్ఞప్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని, తదితర అంశాలపై నేతలతో కూలంకషంగా చర్చించారు. ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలుపునకు నేతలందరూ సమన్వయంతో పనిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

# చెక్ పోస్టుల రద్దు, ఆన్‌లైన్ వ్యవస్థ అమలు

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిన ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ) పాలసీ వల్ల రాష్ట్రంలో గణనీయమైన మార్పు వచ్చిందని మంత్రి వెల్లడిరచారు. ఈ పాలసీ ద్వారా ప్రభుత్వం రూ. 577 కోట్ల టాక్స్‌ను మినహాయించిందని, ఫలితంగా ఈవీ వాహనాల అమ్మకాల వాటా 0.03 శాతం నుంచి 1.13 శాతానికి పెరిగిందని వివరించారు. ఢల్లీలో ఉండే కాలుష్య పరిస్థితి తెలంగాణలో తలెత్తకుండా నిరోధించడానికి ఈ ఈవీ పాలసీని తీసుకొచ్చినట్లు ఆయన స్పష్టం చేశారు.

ఆటోలకు అనుమతి, స్క్రాపింగ్ పాలసీ

నగరంలో 20 వేల ఎలక్ట్రిక్ ఆటోలకు అనుమతి ఇవ్వగా, ఎల్‌పీజీ మరియు సీఎన్‌జీ ఆటోలకు 10 వేలు చొప్పున అనుమతి ఇచ్చామని మంత్రి తెలిపారు. అలాగే, 25 వేల రెట్రోఫిటింగ్ ఆటోలకు (పాత ఆటోలను ఆధునికీకరించడం) అనుమతి ఇచ్చామని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటికే వాహన్ వ్యవస్థ అమలవుతోందని, సారథిని కూడా త్వరలోనే అమలు చేస్తామని తెలిపారు. పాత వాహనాల కోసం స్క్రాపింగ్ పాలసీని తీసుకొచ్చామని, కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాహనాలకు రేడియం స్టిక్కర్స్ అమలు అయ్యేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.

రవాణా శాఖ కార్యాలయాల్లో అవినీతిని అరికట్టడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (%AI%) టెక్నాలజీని ఉపయోగిస్తున్నామని మంత్రి వెల్లడిరచారు. ఈ టెక్నాలజీని ఉపయోగించి, అనవసరంగా, రెగ్యులర్‌గా కార్యాలయాలకు వచ్చే వారిని గుర్తించి హెడ్ ఆఫీస్‌కు అలర్ట్ పంపుతుందని, దీనిని బ్రోకర్ వ్యవస్థను నిరోధించడానికి ఉపయోగిస్తున్నామని చెప్పారు. అలాగే, డిపార్ట్‌మెంట్‌లో పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, 63 కేంద్రాల్లో కెమెరాల ద్వారా పర్యవేక్షణ జరుగుతోందని తెలిపారు.

రోడ్ సేఫ్టీ, కొత్త నియామకాలు

ప్రజలకు రోడ్ సేఫ్టీపై విస్తృత అవగాహన కల్పిస్తున్నామని, దీనిలో భాగంగా నాచారంలో గవర్నర్ ప్రారంభించిన రోడ్ సేఫ్టీ చిల్డ్రన్ అవేర్నెస్ పార్క్‌లను ఏర్పాటు చేస్తున్నామని, కరీంనగర్‌లో కూడా ప్రారంభించుకున్నామని తెలిపారు. కాలేజీలలో రోడ్ సేఫ్టీ క్లబ్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని, త్వరలో ఆటోమేటిక్ డ్రైవింగ్ లైసెన్స్ సిస్టమ్ తీసుకొస్తున్నామని మంత్రి వివరించారు. రవాణా శాఖలో రెవెన్యూ కలెక్షన్ పెంచేందుకు 112 మంది ఏఎంవీఐలను నియమించి శిక్షణ ఇచ్చామని, నలుగురు ఆర్‌టీఓలు గ్రూప్ 1 ద్వారా వచ్చారని తెలిపారు.

చెక్ పోస్టుల రద్దు, ఆదాయ వసూలు

చెక్ పోస్టులు రద్దు చేసినప్పటికీ వాహనాల్లో అక్రమ రవాణా జరగకుండా ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను ఎక్కువగా చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. చెక్ పోస్టుల రద్దు చేయాలని తానే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి కేబినెట్‌లో పెట్టడం జరిగిందని పేర్కొన్నారు. గత పది సంవత్సరాల్లో (పాత ప్రభుత్వ హయాంలో) పాపాల పుట్ట లాగా అవినీతి జరిగిందని ఆరోపించారు. రాష్ట్రంలో ఉన్న 1.7 కోట్ల వాహనాలకు రోడ్డు ప్రమాదాలు తగ్గించేలా చర్యలు తీసుకుంటామని, వచ్చే ఆదాయాన్ని ఆన్‌లైన్ ద్వారా చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు.

# అయ్యప్ప సేవలో ద్రౌపది ముర్ము

## శబరిమలను దర్శించుకున్న తొలి రాష్ట్రపతి



భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కేరళ పర్యటనలో భాగంగా ప్రముఖ పుణ్యక్షేత్రం శబరిమల అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. ఇరుముడి ధరించి స్వామి వారి సన్నిధికి చేరుకున్న ఆమె ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆమె ఆరు కాన్వాయ్‌లతో శబరిమలకు చేరుకున్నారు. సాధారణంగా భక్తులు కాలినడకన మాత్రమే శబరిమల ఆలయాన్ని చేరుకోవాల్సి ఉంటుంది. అయితే, దేశ ప్రథమ పౌరురాలు కావడంతో అధికారులు నిబంధనలు సడలించి, వాహనాల్లో శబరిమల చేరుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శబరిమల ఆలయాన్ని సందర్శించిన తొలి రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము చరిత్ర సృష్టించారు. శబరిమలకు చేరుకునే క్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పెద్ద ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నారు. అయ్యప్ప స్వామిని దర్శించుకునేందుకు ఆమె హెలికాప్టర్‌లో ప్రయాణించారు. ప్రమాదం ప్రాంతంలోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో హెలికాప్టర్ ల్యాండ్ అవుతున్న సమయంలో ఊహించని సంఘటన జరిగింది. హెలిప్యాడ్ ఒక్కసారిగా కుంగిపోయింది.

హెలిప్యాడ్ కూలిపోవడంతో ఆందోళన

హెలికాప్టర్ చక్రం హెలిప్యాడ్ కాంక్రీట్‌లో కూరుకుపోయింది. ఈ అకస్మాత్తు పరిణామంతో అక్కడ కొంత ఆందోళన నెలకొంది. అయితే, అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రమాదం జరగలేదు. అధికారులు వెంటనే స్పందించి, ఆ సమస్యను సరిచేశారు. అనంతరం రాష్ట్రపతి తన పర్యటనను కొనసాగించి, శబరిమలకు చేరుకుని అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు.

# ఆసుపత్రుల నిర్మాణంపై సీఎం ఉన్నతస్థాయి సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

ఈ కీలక సమావేశం వివరాలను ముఖ్యమంత్రి తన అధికారిక 'ఎక్స్' (గతంలో ట్విట్టర్) ఖాతా ద్వారా ప్రజలకు తెలియజేశారు.

నిర్మాణ పనుల పూర్తికి గడువుల నిర్దేశం

సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్మాణ పనుల పూర్తికి ఖచ్చితమైన గడువులను నిర్దేశిస్తూ అధికారులను ఆదేశించారు. చారిత్రక నయా ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణాన్ని రాబోయే రెండేళ్లలో అంటే 2027 నాటికి తప్పనిసరిగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అదేవిధంగా, రాష్ట్రంలోని ఇతర జిల్లాలలో నిర్మాణంలో ఉన్న అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు మరియు కొత్తగా ఏర్పాటు చేస్తున్న వైద్య కళాశాలల నిర్మాణ పనులు వచ్చే జూన్ నాటికి పూర్తయ్యేలా అత్యవసర చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రాజెక్టులన్నీ గడువులోగా పూర్తి కావడానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆయన అధికారులకు సూచించారు.

పర్యవేక్షణకు ప్రత్యేక అధికారుల నియామకం

పనుల్లో నాణ్యత, వేగం తగ్గకుండా చూసేందుకు పర్యవేక్షణ వ్యవస్థను పటిష్టం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇతర ఆసుపత్రులు మరియు వైద్య కళాశాలల నిర్మాణ తీరును ఎప్పటికప్పుడు నిశితంగా పర్యవేక్షించేందుకు వీలుగా ప్రత్యేక అధికారులను నియమించాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రత్యేక అధికారులు ఆయా ప్రాజెక్టుల ప్రగతిని పకడ్బందీగా పరిశీలించి, ఎటువంటి జాప్యం లేకుండా, నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూసే బాధ్యత వహించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

నయా ఉస్మానియా ఆసుపత్రి ప్రాజెక్టు పరిధి మరియు ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని, ఈ నిర్మాణంలో పాలుపంచుకుంటున్న వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లోపించకుండా ఉండేందుకు ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ కమిటీ తరచుగా సమావేశమై, శాఖల మధ్య సమస్యలను పరిష్కరించి, నిర్మాణ పనులకు ఆటంకం కలగకుండా చూసేందుకు కృషి చేయాల్సి ఉంటుందని ముఖ్యమంత్రి తెలిపారు. ఆరోగ్య రంగంలో మౌలిక వసతుల కల్పన పట్ల ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ ఆసుపత్రులు మరియు వైద్య కళాశాలల నిర్మాణాలు పూర్తయితే, రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు ఉన్నత ప్రమాణాలు కలిగిన ఉచిత వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని, తద్వారా తెలంగాణ 'ఆరోగ్య తెలంగాణ' దిశగా పయనిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అధికారులందరూ తమ బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తించాలని ముఖ్యమంత్రి సూచించారు.

# మైనర్ బాలికపై అత్యాచారం పోక్సో కోర్టు సంచలన తీర్పు

## బాలికను కిడ్నాప్ చేసి పలుమార్లు అత్యాచారం

హైదరాబాద్, అక్టోబర్ 22(తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లా పోక్సో న్యాయస్థానం మైనర్ బాలికపై అత్యాచారం కేసులో సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న గురజాల చందుకు కోర్టు 32 ఏళ్ల కఠిన కారాగార శిక్షను విధిస్తూ తీర్పునిచ్చింది. ఈ సంఘటన 2022లో జరిగింది. నిందితుడు మైనర్ బాలికను కిడ్నాప్ చేసి, పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్లు నల్గొండ రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి నుంచి స్థానిక పోక్సో కోర్టులో ఈ కేసుపై వాదనలు జరిగాయి. నేడు (బుధవారం) పోక్సో కోర్టు ఇన్‌ఛార్జ్ న్యాయమూర్తి రోజారమణి తీర్పును వెలువరించారు. నిందితుడు గురజాల చందుకు 32 ఏళ్ల జైలు శిక్షతో పాటు, రూ. 75 వేల జరిమానాను కూడా కోర్టు విధించింది. అంతేకాకుండా, బాధితురాలికి రూ. 10 లక్షల పరిహారం అందించాలని కూడా న్యాయస్థానం తన తీర్పులో స్పష్టంగా పేర్కొంది. మైనర్ బాలికపై జరిగిన ఈ అమానుష ఘటనకు సంబంధించి నల్గొండ పోక్సో కోర్టు ఇచ్చిన ఈ కఠిన శిక్ష, ఇటువంటి నేరాలకు పాల్పడేవారికి గట్టి హెచ్చరిక పంపినట్లయింది. బాధితురాలికి పరిహారం అందించాలని ఆదేశించడం ద్వారా ఆమె పునరావాసానికి న్యాయస్థానం తోడ్పాటు అందించింది.

# జూ. ఎన్టీఆర్ మార్ఫింగ్ ఫొటోలపై సీపీ సజ్జనార్‌కు అభిమానుల ఫిర్యాదు

(మొదటి పేజీ తరువాయి)

తమ అభిమాన నటుడి ఫొటోలను మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసేవారిని తక్షణమే గుర్తించి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మురళి సీపీని కోరారు. అలాగే, సోషల్ మీడియాలో ఉన్న అభ్యంతరకర పోస్టులను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నటుడి వ్యక్తిగత ప్రతిష్ఠను కాపాడాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా అభిమానులు పేర్కొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో అన్నదాతలు అరిగోస

(మొదటి పేజీ తరువాయి)

ఈ మేరకు కవిత తన అధికారిక 'ఎక్స్' (గతంలో ట్విట్టర్) ఖాతా ద్వారా ప్రభుత్వాన్ని నిలదీశారు.

రాష్ట్రంలో దళారులే ఏకంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, మద్దతు ధర కన్నా రూ. 400 తక్కువకు మక్కలు కొనుగోలు చేస్తున్నారని కవిత ఆరోపించారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా? అన్న అనుమానం కలుగుతోందని ఆమె తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా, రుణమాఫీ వంటి హామీలను ఎగ్గొట్టడమే కాకుండా, అన్నదాతలకు సమయానికి విత్తనాలు, ఎరువులు కూడా ఇవ్వలేకపోయిందని కవిత విమర్శించారు. ఆరుగాలం కష్టపడి పండిరచిన పంటను కనీసం మద్దతు ధరకు కొనుగోలు చేయలేకపోతోందని ఆమె దుయ్యబట్టారు.

రాజకీయ ప్రయోజనాలు తప్ప ప్రజల వ్యథలు పట్టించుకోని ఈ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని కవిత హెచ్చరించారు. రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించి, మద్దతు ధరకే మక్కలను కొనుగోలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

# ఎయిర్ ఇండియా విమానంలో మళ్లీ సాంకేతిక లోపం

- ముంబై-నెవార్క్ విమానంలో సమస్య
- సురక్షిత ల్యాండిరగ్, ప్రయాణికులకు ఊరట



ప్రముఖ దేశీయ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియాలో సాంకేతిక సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా ముంబై నుంచి అమెరికాలోని నెవార్క్ నగరానికి బయల్దేరిన ఒక విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. ఈ సమస్య కారణంగా విమానం కొన్ని గంటల పాటు గాల్లోనే చక్కర్లు కొట్టింది. చివరికి, ముంబై ఎయిర్‌పోర్ట్‌లో సురక్షితంగా అత్యవసరంగా ల్యాండ్ అయింది. ఎయిర్ ఇండియాకు చెందిన ఏఐ 191 విమానం మంగళవారం అర్ధరాత్రి 1.15 గంటలకు ముంబై ఎయిర్‌పోర్ట్ నుంచి అమెరికా న్యూజెర్సీలోని నెవార్క్‌కు బయలుదేరింది. అయితే, విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే పైలట్ సాంకేతిక లోపాన్ని (టెక్నికల్ ఎర్రర్) గుర్తించారు. వెంటనే ఈ విషయాన్ని ముంబై ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) అధికారులకు తెలియజేశారు. ఎయిర్‌పోర్ట్ అధికారుల సూచన మేరకు పైలట్ విమానాన్ని తిరిగి ముంబైకి మళ్లించారు.

సాంకేతిక లోపంతో విమానం బుధవారం తెల్లవారుజామున 5.30 గంటలకు ముంబై ఎయిర్‌పోర్టులో సురక్షితంగా ల్యాండ్ అయ్యింది. ఈ ఘటనతో ప్రయాణికులు అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విమానం సేఫ్‌గా ల్యాండ్ కావడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. విమానయాన సంస్థ ప్రతినిధి తెలిపిన వివరాల ప్రకారం, ఈ సాంకేతిక సమస్య కారణంగా నెవార్క్ నుంచి ముంబైకి రావాల్సిన ఏఐ 191 మరియు ఏఐ 144 విమానాలను కూడా రద్దు చేశారు. గత కొంతకాలంగా ఎయిర్ ఇండియా విమానాల్లో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా సుదూర ప్రయాణాలు చేసే విమానాలలో ఇలాంటి ఘటనలు పునరావృతం కావడం ప్రయాణికులను ఆందోళనకు గురిచేస్తోంది. విమానాల్లో సాంకేతిక లోపాలు తలెత్తిన ప్రతిసారీ ఎయిర్‌పోర్టుల్లో అత్యవసర ల్యాండిరగ్‌లు చేయాల్సి వస్తోంది. ఈ ఘటనలపై సంస్థ తగు చర్యలు తీసుకుని, తమ విమానాలను మరింత పటిష్టం చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.




## జర్నలిస్ట్ వెంకటకృష్ణ సేవలు చిరస్మరణీయం

**వెంకటకృష్ణ సంతాపంలో టి.జె.ఎఫ్ నేతలు**

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 22, తెలంగాణ ముచ్చట్లు;** జర్నలిస్ట్ వెంకట కృష్ణారావు సేవలు చిరస్మరణీయమని, ఆయన భౌతికంగా మన మధ్య లేకపోవడం జర్నలిస్టులకు తీరని లోటని టి యు డబ్ల్యూ జే (టీజేఎఫ్ ) జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి, జాతీయ కౌన్సిల్ సభ్యులు వెన్నబోయిన సాంబశివరావు అన్నారు. స్కై లైన్ దినపత్రిక ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ వెంకటకృష్ణ రావు గుండె పోటుతో మృతి చెందగా ఆయన మృతికి సంతాప సభను ఖమ్మం ప్రెస్ క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు అధ్యక్షతన సంతాపసభ నిర్వహించారు.

ఈ సందర్భంగా టి యు డబ్ల్యూ జే (టీజేఎఫ్ ) జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి, జాతీయ కౌన్సిల్ సభ్యులు వెన్నబోయిన సాంబశివరావు లు మాట్లాడుతూ.. వెంకటకృష్ణ తన పాత్రికేయ జీవితంలో నిజాయితీ, నిబద్ధతతో సేవలందించారని, యూనియన్ బలోపేతానికి ఆయన పోరాటపటిమ, ఆయన చేసిన సేవలను కొనియాడారు. యూనియన్ చేపట్టిన ప్రతి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని యూనియన్ బలోపేతం కోసం జర్నలిస్టుల ఆకాంక్షను పెంపొందించేందుకు ముందుండి పోరాడిన జర్నలిస్టు వెంకటకృష్ణ అని కొనియాడారు. ఆరోగ్యం పట్ల ప్రతి జర్నలిస్ట్ జాగ్రత్తగా ఉండాలని,తమ కుటుంబం, పిల్లల చదువులపై తగిన దృష్టి సారించాలని పేర్కొన్నారు. తొలుత వెంకటకృష్ణ చిత్ర పటానికి జర్నలిస్టులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఆర్ టి వి బ్యూరో చీఫ్ ఉదయ్, వనం నాగయ్య, టీఎస్ చక్రవర్తి, కలవకొలను హరీష్ రాజు, మందుల ఉపేందర్, నగర ప్రధాన కార్యదర్శి అమరవరపు కోటేశ్వరరావు, ప్రెస్ క్లబ్ కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు, కోశాధికారి బిక్కి గోపి, సహాయ కార్యదర్శి మూల జీవన్ రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా నగర కార్యదర్శి కె .అశోక్, నాయకులు సంతోష్, ఇస్సాంపల్లి వెంకటేశ్వర్లు, అప్పారావు, పి సి డబ్ల్యూ నరేష్, పానకాలరావు, తిరుపతిరావు,రోజా, ఉల్లోజు రమేష్, గణేష్, శంకర్, మంద వెంకటేశ్వర్లు, శ్రీధర్, శేఖర్, పెంటి వెంకటేశ్వర్లు, ప్రభాకర్ రెడ్డి, రోసి రెడ్డి, బాబు, ఉపేందర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



## చదువు మాత్రమే జీవితానికి గౌరవం తెస్తుంది

**డా. జిల్లెల చిన్నారెడ్డి ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు**

**వనపర్తి,అక్టోబర్22(తెలంగాణ ముచ్చట్లు):** పట్టుదల, కష్టపడి చదువుకుంటే జీవితంలో ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లెల చిన్నారెడ్డి అన్నారు.వనపర్తి మండలం రాజపేట గ్రామానికి చెందిన లక్ష్మయ్య-ఈశ్వరమ్మ దంపతుల కుమారుడు మోహన్‌కుమార్ నీట్ పరీక్షలో 383 మార్కులు సాధించి 6000 రాష్ట్ర ర్యాంక్ తో జయశంకర్ భూపాలపల్లి మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు పొందిన సందర్భంగా డా. చిన్నారెడ్డి గారు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా డా. చిన్నారెడ్డి మాట్లాడుతూ..మోహన్‌కుమార్ చిన్నప్పటి నుంచీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకుని, నిరంతర శ్రమతో ఈ స్థాయికి రావడం ఎంతో గర్వకారణం. పేదరికం ఎప్పుడూ అడ్డంకి కాదు. కష్టపడి చదివితే చదువు మాత్రమే జీవితానికి గౌరవం తెస్తుంది. యువత పట్టుదలతో ముందుకు సాగి తమ కుటుంబం, గ్రామం, జిల్లాకు గౌరవం తీసుకురావాలి అని అన్నారు.మోహన్‌కుమార్ మంచి వైద్యుడిగా ఎదిగి వనపర్తి నియోజకవర్గానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, వనపర్తి పట్టణ ప్రధాన కార్యదర్శి బాబా, జిల్లా ఏఐపిసిసి ఉపాధ్యక్షులు నాగార్జున, జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు రోహిత్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆవుల చంద్రశేఖర్, యూత్ నాయకులు ఇర్ఫాన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అంజి రెడ్డి, వాకిటి బాలరాజ్, కోళ్ల వెంకటేష్, జానంపేట నాగరాజు, రామ్‌సింగ్ నాయక్, మన్యం యాదవ్, అబ్దుల్లా, నందిమల్ల రాము, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి జె.వి.ఆర్ గనిని పరిశీలించిన పర్యావరణ, అటవీ శాఖ బృందం





**గని నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసిన అధికారులు**

**సత్తుపల్లి, అక్టోబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** స్థానిక జలగం వెంగళరావు, కిష్టారం సింగరేణి ఉపరితల గనులను పర్యావరణ, అటవీ శాఖల సంయుక్త బృందం మంగళవారం సందర్శించింది. పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ ప్రతినిధి ప్రొఫెసర్ ఆర్.ఎం. బట్టచార్జీ, సింగరేణి పర్యావరణ విభాగం ప్రధాన మేనేజర్ సైదులు, కొత్తగూడెం ప్రాంత ప్రధాన మేనేజర్ శాలెం రాజుతో కలిసి గనిని పరిశీలించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో గని కార్యకలాపాలపై వివరాలు తెలుసుకుని, పలు సూచనలు చేశారు. గని ప్రాంతంలో కాలుష్య నివారణకు చేపడుతున్న చర్యలను బట్టచార్జీ ప్రశంసించారు. బొగ్గు దుమారం నివారించడానికి నీటిని వెదజల్లడం, విస్తృతంగా మొక్కలు నాటడం వంటి చర్యలు సమర్థవంతంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. రాబోయే రోజుల్లో పర్యావరణ పరిరక్షణకు మరింత ప్రాధాన్యం ఇచ్చి, గని పరిసర గ్రామాలకు ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులు సూచించారు.

పరిశీలన కార్యక్రమంలో జె.వి.ఆర్ గని ప్రాజెక్ట్ అధికారి ఎన్.వి.ఆర్. ప్రహ్లాద్, ఏరియా అధికారి కోటిరెడ్డి, రాజేశ్వరరావు, కళ్యాణ్ రామ్, పర్యావరణ విభాగం అధికారులు రవికిరణ్, పి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కార్తీక మాసం తొలి రోజు కీసరగుట్టలో భక్తుల రద్దీ





**కీసర, అక్టోబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** కార్తీక మాసం ప్రారంభమైన తొలి రోజునే మేడ్చల్ జిల్లా కీసరగుట్ట శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ కనిపించింది. పరమశివుడికి అత్యంత ప్రీతికరమైన ఈ పవిత్ర మాసంలో తెల్లవారు జామున నుంచే కుటుంబ సమేతంగా భక్తులు స్వామి దర్శనార్థం తరలివచ్చారు.

ఆలయ ప్రాంగణం భక్తి భావంతో కళకళలాడగా, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఆకాశ దీపం దర్శించేందుకు భక్తులు ఉత్సాహం చూపుతున్నారు. భక్తుల సౌకర్యార్థం ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో సుధాకర్ రెడ్డి తెలిపారు. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి సౌకర్యాలు సమకూర్చినట్లు చెప్పారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి కార్తీక మాసంలో భక్తుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉందని ఆలయ అధికారులు పేర్కొన్నారు.

# మా భూముల మాకే కావాలి






- దేవుని పేరుతో జీవనోపాధి భూములు లాక్కోవడం అన్యాయం
- ప్రజా ప్రతినిధులు, అధికారులు తమ వైఖరి మార్చుకోవాలి
- బలవంతంగా భూములు లాక్కుంటే మాకు చావే చరణ్యం
- విలేకరుల సమావేశంలో ఖమ్మం 15వ డివిజన్ అల్లిపురం దళిత రైతుల ఆవేదన

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 22, తెలంగాణ ముచ్చట్లు;** మా భూములు మాకే కావాలని, జీవనోపాధితో పాటు పిల్లల చదువుకు ఉపయోగపడుతున్న భూములను దేవుని ఆలయం పేరుతో బలవంతంగా లాక్కోవటం సరైంది కాదని ఖమ్మం అర్బన్, దంసలాపురం రెవిన్యూ, 15వ డివిజన్ అల్లిపురంకు చెందిన దళిత రైతులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దళితులు మాట్లాడుతూ... ఖమ్మం అర్బన్ ధంసలాపురం రెవెన్యూ అల్లిపురం 15వ డివిజన్లోని సర్వే నెంబర్ 408 లో 15 ఎకరాల భూమిని వారసత్వంగా 12 మంది దళిత రైతులు సాగు చేసుకుంటున్నామన్నారు. పేద, అణగారిన దళిత వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం గత 60 సంవత్సరాల క్రితం భూమిలేని నిరుపేదలకు భూములను కేటాయించిందని, వారసత్వంగా వస్తున్న ఆ భూములకు పట్టా, పాస్ పుస్తకాలు కూడా ప్రభుత్వం కేటాయించిందని తెలియజేశారు. అట్టి భూమి తప్ప మాకు వేరే భూమి లేదన్నారు. వారసత్వంగా ఆ భూములను సాగు చేసుకుంటూ జీవనోపాధితో పాటు పిల్లలను చదివించుకుంటున్నామని అన్నారు. తిరుమల తిరుపతి దేవాలయం పేరుతో సాగు చేసుకుంటున్న మా భూములను స్థానిక ప్రజా ప్రతినిధులు లాక్కోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు తమ వైఖరిని మార్చుకొని దళితుల అభివృద్ధికి పాటుపడాలని పేర్కొన్నారు. సాగు చేసుకుంటున్న మా భూములను బలవంతంగా లాక్కుంటే మాకు చావే చరణ్యం అని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విలేకరుల సమావేశంలో గద్దల రాంబాబు, గద్దల వెంకటరమణ, కొండ అమేల్యమ్మ, బర్ల రవి, బర్ల ఫ్రాన్సిస్, జొన్నలగడ్డ లలిత, ఆమడాల రోజమ్మ బర్ల కోటేష్, షేక్ మీరాబి, మద్దె పుల్లమ్మ, పి లలితమ్మ, గొర్రె ముచ్చు ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

# సికింద్రాబాద్ కంటోన్మెంట్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

**ఎంపీ ఈటల రాజేందర్**

**సికింద్రాబాద్, అక్టోబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సమావేశంలో మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటోన్మెంట్ పరిధిలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సమన్వయంతో ముందుకు సాగుతున్నాయని తెలిపారు. కొంపల్లి వైపు, షామీర్‌పేట్ వైపు రహదారి రద్దీ తగ్గించేందుకు, ప్రజల రాకపోకలు సులభతరం చేయడానికి ఫ్లైఓవర్ నిర్మాణాలు చేపట్టడం జరుగుతోందని చెప్పారు. ఇందుకోసం రక్షణ శాఖ మరియు కంటోన్మెంట్ భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించినట్టు వివరించారు.కంటోన్మెంట్ భూముల బదలాయింపుకు బదులుగా వచ్చిన నిధులు కంటోన్మెంట్ బోర్డుకు జమ కావడంలో తాను, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కలిసి కేంద్ర రక్షణ శాఖ మంత్రిని పలుమార్లు కోరడం ద్వారా ఆ నిధులను జమ చేయించామని ఈటల రాజేందర్ తెలిపారు.ఈ నిధులను సమర్థవంతంగా వినియోగించి కంటోన్మెంట్ ప్రాంతాన్ని సుందరమైన “నందనవనం”గా తీర్చిదిద్దాలని ఆయన అధికారులు సూచించారు. మొత్తం రూ.303 కోట్ల రూపాయలతో సమగ్ర అభివృద్ధి ప్రణాళికను రూపొందించి అమలు చేయాలని సూచించారు. 2051 సంవత్సరానికి అంచనా వేసే జనాభా వృద్ధిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సరఫరా, మురుగునీటి



వ్యవస్థ, వరదనీటి నికాసా వంటి అంశాల్లో శాస్త్రీయంగా, ఆధునికంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. జిహెచ్ఎంసి, హెచ్ఎండిఏ సంస్థలతో సమన్వయం చేసుకొని కంటోన్మెంట్‌లో ఎక్కడా చుక్క నీరు నిలవకుండా, మురుగు వాసన లేకుండా సమగ్ర పారిశుద్ధ్య ప్రణాళిక అమలు చేయాలని సూచించారు. పనులు వేగంగా పూర్తి చేయగల, నాణ్యతను కాపాడగల కాంట్రాక్టర్లకు మాత్రమే కాంట్రాక్టులు ఇవ్వాలని కోరారు.అలాగే కంటోన్మెంట్ బోర్డు సభ్యులు, కార్పొరేటర్లు, స్థానిక ప్రజా ప్రతినిధుల సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకొని అభివృద్ధి ప్రణాళికలు అమలు చేయడం ద్వారా కంటోన్మెంట్‌ను ఒక ఆదర్శ ప్రాంతంగా తీర్చిదిద్దవచ్చని ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: పొట్లపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# రిటైర్మెంట్ బకాయిలు రాక మనోవేదనతో మృతి


- మరణించిన వారికి నివాళి.
- విశ్రాంత ఉద్యోగుల సంఘం నేతల ఆవేదన

**సత్తుపల్లి, అక్టోబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** ఉద్యోగ విరమణ చేసినా, ప్రభుత్వంచే రావలసిన ఆర్థిక ప్రయోజనాలు అందక మనోవేదనకు గురై బలవన్మరణం చెందిన విశ్రాంత ఉద్యోగులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు నివాళి ఘటించారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో కొవ్వత్తులు వెలిగించి మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేశారు.

ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు కేశవరెడ్డి, కార్యదర్శి ప్రకాశరావులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో విశ్రాంత ఉద్యోగులకు బకాయిలు, పెన్షన్ ప్రయోజనాలు చెల్లించకపోవడం వల్ల పలువురు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారు చికిత్సకు నిధులు లేక ఇబ్బంది పడుతుండగా, కొందరు తీవ్ర మనోవేదనతో ప్రాణాలు త్యజించడం బాధాకరమని పేర్కొన్నారు.

రాజ్యాంగంలోని 21వ అధికారం ప్రకారం ప్రతి పౌరుడికి జీవించే హక్కు ఉన్నదని గుర్తుచేసి, విశ్రాంత ఉద్యోగుల హక్కులను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోర్టులు అనేకసార్లు ఆర్థిక ప్రయోజనాలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వం కు ఆదేశించినా, అవి అమల్లోకి రాకపోవడం దురదృష్టకరమన్నారు. కోర్టు తీర్పులను వెంటనే అమలు చేసి, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు రామిశెట్టి సుబ్బారావు, డి.కృష్ణయ్య, బి.దాసు, నర్సయ్య, సాంబశివరెడ్డి, మల్లికార్జునరావు, జి.కృష్ణయ్య, ఎం.అప్పారావు, ఆంజనేయశాస్త్రి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# గాంధీ భవన్‌లో దీపావళి పండుగ వేడుకలు

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, అక్టోబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** గాంధీ భవన్‌లో పి సి సి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్ నగరి ప్రీతమ్ తో కలిసి సామాజిక, రాజకీయ నాయకులు, ఎస్సీ సంఘాల ప్రతినిధులను ఆహ్వానించి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పత్తి కుమార్ ముఖ్యంగా పాల్గొన్నారు.కార్యక్రమంలో జలపల్లి నరేంద్ర, రఫీక్, సుదేశ్, మధుమోహన్ తదితర నాయకులు, స్థానిక సామాజిక కార్యకర్తలు హాజరై, పరస్పర అభివందనాలు మరియు వేడుకలో ఉల్లాసంలో పాల్గొన్నారు. మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, "సమస్యల పరిష్కారం కోసం, సామాజిక సమరసత్వం కోసం ప్రతి సందర్భంలో మనం ముందుకు రావాలి. దీపావళి సంతోషాన్ని అందరితో పంచుకోవడం ముఖ్యమని" అన్నారు.కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో పూర్తి కాగా, పాల్గొన్న ప్రతీ ఒక్కరికీ దీపావళి కై పూలు, కాండీలు మరియు స్వీట్ బాక్స్‌లు అందజేయడం జరిగింది.




# వరి కొనుగోలు నాణ్యత ప్రమాణాలపై శిక్షణా కార్యక్రమం

**పెద్దమందడి మండల వ్యవసాయ శాఖ అధికారి సైదుల్ యాదవ్**

**పెద్దమందడి,అక్టోబర్22( తెలంగాణ ముచ్చట్లు):** వానాకాలం 2025-26 వరి కొనుగోలు సీజన్‌కు ముందుగా, రైతులకు నాణ్యత ప్రమాణాలపై అవగాహన కల్పించేందుకు బుధవారం పామిరెడ్డి పల్లి రైతు వేదికలో మండల స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో పెద్దమందడి మండల వ్యవసాయ శాఖ అధికారి సైదులు యాదవ్ మాట్లాడుతూ.. వరి కొనుగోలు సమయంలో ప్రతి క్వింటాల్ ధాన్యం తేమ శాతం, రకాన్ని కచ్చితంగా గుర్తించి మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు ప్రభుత్వ నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా వరిని ఎండబెట్టి, శుభ్రంగా ఉంచితే లాభదాయకంగా విక్రయం జరుగుతుందని వివరించారు. అలాగే కొనుగోలు కేంద్రాల్లో పి.ఎ.సి.ఎస్ మరియు ఐ.కే.పీ సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం తూకం, రేటు నిర్ణయం జరగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు, సహాయక ప్రాజెక్టు మేనేజర్, పి.ఎ.సి.ఎస్ ప్రధాన కార్యనిర్వాహక అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారులు, పి.ఎ.సి.ఎస్ మరియు ఐ.కే.పీ సిబ్బంది పాల్గొన్నారు.

# యువత మేలుకో ఈ దేశాన్ని ఏలుకో






**కీసరలో ఉస్మానియా యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ శిబిరం ప్రారంభం**

**కీసర, అక్టోబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు)** మేడ్చల్ జిల్లా కీసరలో ఉస్మానియా యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కె.ఆర్.కె. డిగ్రీ కాలేజ్ విద్యార్థులు నిర్వహిస్తున్న జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ప్రత్యేక శిబిరం ఘనంగా ప్రారంభమైంది. ఈ శిబిరం అక్టోబర్ 22 నుండి 28 వరకు కొనసాగనుంది.ఈ శిబిరంలో భాగంగా విద్యార్థులు గ్రామీణ ప్రజల్లో సామాజిక అవగాహన, ఆరోగ్య సంరక్షణ, విద్యా ప్రాముఖ్యత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై కార్యక్రమాలు నిర్వహించనున్నారు. విద్యార్థులు ఇంటింటికీ వెళ్లి యువతలో మాదకద్రవ్యాల పట్ల దూరంగా ఉండాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సందేశం ఇవ్వనున్నారు.అదే విధంగా పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, బాలికల విద్య ప్రాధాన్యత, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన, సేంద్రియ వ్యవసాయం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు.శిబిరం ప్రారంభ సందర్భంగా కీసర అంబేద్కర్ చౌరస్తా నుండి కె.ఆర్.కె. డిగ్రీ కాలేజ్ వరకు విద్యార్థులు "యువత మేలుకో - ఈ దేశాన్ని ఏలుకో" నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రజల్లో చైతన్యం కలిగించే నినాదాలతో ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకులు, కె.ఆర్.కె. కాలేజ్ ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పాల్గొని విద్యార్థుల ఉత్సాహాన్ని అభినందించారు. విద్యార్థుల్లో సేవా భావం పెంపొందించడం, సామాజిక బాధ్యతలు నేర్పించడం ఎన్ఎస్ఎస్ లక్ష్యమని అధ్యాపకులు పేర్కొన్నారు. సమాజాభివృద్ధి, పర్యావరణ సంరక్షణ, గ్రామీణ ప్రగతికి యువత ముందుండాలని వారు సూచించారు.

# రక్తదానంతో సేవాస్ఫూర్తి చాటిన 15వ బెటాలియన్ సిబ్బంది

**పోలీసు జెండా దినోత్సవాల్లో భాగంగా కార్యక్రమం.**






**సత్తుపల్లి, అక్టోబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** బి.గంగారం గ్రామం, పోలీసు జెండా దినోత్సవాల సందర్భంగా 15వ ప్రత్యేక పోలీసు బెటాలియన్ ఆధ్వర్యంలో బుధవారం బెటాలియన్ కార్యాలయంలో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. బెటాలియన్ సిబ్బంది, అధికారులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు.

ఈ సందర్భంగా బెటాలియన్ కమాండెంట్ ఎన్. పెద్దబాబు మాట్లాడుతూ, అన్నీ దానాలలోకంటే రక్తదానం అత్యుత్తమమని, రక్తదానం చేయడం ద్వారా అనేకమంది ప్రాణాలు కాపాడబడతాయని అన్నారు. రక్తదానం చేయడం ఆరోగ్యానికి మేలని, సమాజంలోని ఆర్థికంగా వెనుకబడిన వారికి ఇది గొప్ప సహాయం అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కమాండెంట్ ఏ. అంజయ్య, బెటాలియన్ వైద్యాధికారి అవినాష్, పిఎస్సీ గంగారం వైద్యులు ఆకాష్, సిబ్బంది, కానిస్టేబుల్ అధికారి బృందం పాల్గొన్నారు.

# మరణించిన కుటుంబాలకు పీఎస్ఆర్ ట్రస్ట్ సాయం






**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 22, తెలంగాణ ముచ్చట్లు;** మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల మరణించిన కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సూచనల మేరకు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ తరఫున ఈ సాయం అందించారు. గత నెల సెప్టెంబర్ 15 నుండి అక్టోబర్ 20 వరకు మరణించిన వ్యక్తుల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.10,000 చొప్పున సహాయం బుధవారం పంపిణీ చేశారు. జలగం నగర్, కేబిఆర్ నగర్, ఆర్టీసీ కాలనీ, పెద్దతండా, వరంగల్ క్రాస్ రోడ్, గుర్రాలపాడు, ఇందిరమ్మ కాలనీ, గుదిమళ్ల, తెల్దారుపల్లి, మద్దులపల్లి, బారుగూడెం, ఏదులాపురం, సూర్యనగర్, చిన్నతండా, సత్యనారాయణపురం, రాజీవ్ గృహకల్ప తదితర ప్రాంతాల్లో మొత్తం 37 కుటుంబాలు లబ్ధి పొందాయి. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, పొంగులేటి అభిమానులు పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# పాఠశాలల అభివృద్ధికి ప్రణాళికాబద్ధ చర్యలు...




**రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి డా. యోగితా రాణా**

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్- 22, తెలంగాణ ముచ్చట్లు;** మధిర నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల సమగ్ర అభివృద్ధికి పకడ్బందీ కార్యాచరణ చేయాలని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి డా. యోగితా రాణా అన్నారు. విద్యాశాఖ కార్యదర్శి, విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ తో కలిసి హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మధిర నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల సమగ్ర అభివృద్ధి పై సమీక్షించారు. ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, జిల్లా విద్యా శాఖ అధికారిణి డా. పి. శ్రీజ తో కలిసి క్యాంపు కార్యాలయం నుండి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖ కార్యదర్శి మాట్లాడుతూ, మధిర నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల సమగ్ర అభివృద్ధి కి కార్యాచరణ చేయాలన్నారు. అన్ని ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్ లర్నింగ్ ల్యాబ్‌ల ప్రారంభానికి చర్యలు చేపట్టాలన్నారు. అన్ని హైస్కూల్ లలో విద్యార్థుల నమోదు, రాబోయే విద్యార్థుల నమోదు దృష్టిలో పెట్టుకొని కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, లైబ్రరీ, కాంపౌండ్ వాల్, ఫర్నిచర్, ప్లే గ్రౌండ్ ల అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. స్టేట్ టీమ్ త్వరలో సందర్శించనున్నదని, అందరూ ప్రధానోపాధ్యాయులతో సమావేశమై, పాఠశాలల వారిగా ఏమేం అవసరాలో గుర్తించి తదనుగుణంగా చర్యలు చేపట్టనున్నట్లు విద్యాశాఖ కార్యదర్శి తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ, మధిర నియోజకవర్గ పరిధిలోని పాఠశాలల్లో ఎన్ని తరగతి ఉన్నాయి, టాయిలెట్ బ్లాక్స్, కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, సైన్స్ ల్యాబ్, లైబ్రరీ, క్రీడా వసతుల లభ్యత, ప్రీ ప్రైమరీ కి గదులు ఉన్నవి, ఎంత మేర స్థల లభ్యత ఉన్నది, అభివృద్ధి పనులు చేపట్టినవి వివరాల నివేదిక వెంటనే సిద్ధంచేసి సమర్పించాలన్నారు. పాఠశాలల సమగ్ర అభివృద్ధికి మంచి అవకాశమని, దీనిని సద్వినియోగం చేసుకొని, కార్పోరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలన్నారు. ఈ సమీక్ష లో జిల్లా విద్యాశాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ సిహెచ్. రామకృష్ణ, విద్యాశాఖ ఇఇ బుగ్గయ్య, మండల విద్యాశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# అధికారులు శంకరన్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

డా.జిల్లెల చిన్నారెడ్డి

**వనపర్తి,అక్టోబర్22(తెలంగాణ ముచ్చట్లు):** ప్రజాసేవకు, నిష్కపటతకు ప్రతీకగా నిలిచిన ఐఏఎస్ అధికారి ఎస్.ఆర్. శంకరన్ జీవితం ప్రతి అధికారికి ఆదర్శంగా ఉండాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లెల చిన్నారెడ్డి పిలుపునిచ్చారు. ఎస్.ఆర్. శంకరన్ 91వ జయంతి సందర్భంగా వనపర్తి పట్టణ గ్రీన్‌పార్క్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు.డా. చిన్నారెడ్డి మాట్లాడుతూ..
శంకరన్ తమిళనాడులోని తంజావూరు గ్రామంలో జన్మించి విద్యాపట్ల ఉన్న ఆసక్తితో ఉన్నత విద్యను పూర్తిచేసి కేవలం 22 ఏళ్లకే ఐఏఎస్ అధికారి అయ్యారని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అదిలాబాద్, ఖమ్మం, నెల్లూరు జిల్లాల్లో జిల్లా కలెక్టర్‌గా పనిచేసి ఆ ప్రాంతాల అభివృద్ధికి విశేష సేవలందించారని పేర్కొన్నారు.
కలెక్టర్‌గా ఉన్న సమయంలో తన జీతాన్ని కూడా పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి వినియోగించిన గొప్పమనస్కుడని తెలిపారు. వైయస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్రంలో నక్సలైట్ సమస్య పరిష్కారానికి శంకరన్ నేతృత్వంలో శాంతి చర్చలు జరిపిన విషయం గుర్తుచేశారు.ప్రిన్సిపల్ సెక్రటరీగా పనిచేసిన శంకరన్ గారు సామాజిక సంక్షేమం, బీసీ, ఎస్సీ, ఎస్టీ శాఖల్లో పలు సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టి, రెసిడెన్షియల్ పాఠశాలల ద్వారా ఉచిత విద్యావకాశాలను కల్పించారని తెలిపారు. పద్మభూషణ్ వంటి అత్యున్నత పౌర గౌరవాన్ని కూడా స్వీకరించకుండా నిరాడంబర జీవితాన్ని గడిపిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు.అవినీతి మచ్చ లేకుండా కలెక్టర్, సెక్రటరీ, చీఫ్ సెక్రటరీ స్థాయిల్లో నిజాయితీగా సేవలందించిన శంకరన్ ను ఆదర్శంగా తీసుకుని నేటి అధికారులు ప్రజల సేవలో నిబద్ధతతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, వనపర్తి పట్టణ ప్రధాన కార్యదర్శి బాబా, ఏఐపిసిసి ఉపాధ్యక్షులు నాగార్జున, జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు రోహిత్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆవుల చంద్రశేఖర్, యూత్ నాయకులు ఇర్ఫాన్, మాజీ కౌన్సిలర్ ప్రేమ్‌నాథ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అంజిరెడ్డి, వాకిటి బాలరాజ్, కోళ్ల వెంకటేష్, జానంపేట నాగరాజు, ఎంట్ల రవి, రామ్‌సింగ్ నాయక్, మన్యం యాదవ్, అబ్దుల్లా, నందిమల్ల రాము, లక్ష్మయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఘట్కేసర్‌లో గోరక్షకుడిపై దాడి తీవ్రంగా గాయపడ్డ వ్యక్తిని పరామర్శ

**రాష్ట్ర బిజెపి అధ్యక్షులు రాంచందర్రావు ,ఎంపీ ఈటల రాజేందర్**

**ఘట్కేసర్, అక్టోబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ వద్ద గోవులను తరలిస్తున్న సమయంలో గో రక్షకుడు అడ్డుకోవడంతో తీవ్రంగా గాయపరిచారు వ్యక్తిని సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న సోను (ప్రశాంత్) ను బుధవారం రోజు రాష్ట్ర బిజెపి అధ్యక్షులు రాంచందర్రావు ,ఎంపీ ఈటల రాజేందర్ పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.మీడియాతో మాట్లాడుతూ ఈటల రాజేందర్ , "మన దేశంలో గోవులను పూజిస్తారు. గోమాతలను రక్షించడానికి సనాతన ధర్మాన్ని నమ్మిన లక్షలాది భక్తులు నిరంతరం కృషి చేస్తున్నారు. కానీ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గోవులను తరలించే గుండాలను, మాఫియాలను కాపాడుతున్నారు. అనేకసార్లు, ముఖ్యంగా ఎంఐఎం నాయకులు గోరక్షకులపై దాడులు చేస్తున్నారు. వాహనాలతో గుద్ధి హత్యకు ప్రయత్నం చేసిన ఘటనలు జరిగినాయి," అని తెలిపారు. "ఓల్డ్ సిటీ నుంచి వచ్చిన ఇబ్రహీం అనే వ్యక్తి ప్రశాంత్ ను కాల్చి చంపే ప్రయత్నం చేశారు. ఈ ప్రభుత్వం దానిపై ఎలా స్పందిస్తుంది అనేది ప్రశ్నార్థకం. ఈ ఘటనకు సంపూర్ణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వమే వహించాలి. దాడిలో పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. ఈ విధమైన ఘటనలు పునరావృతం కాకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలి," అని uh హెచ్చరించారు. ఎంపీ ఈటల రాజేందర్ ఈ ఘటనను నిజామాబాదు లో పోలీసుల పై సవాల్ చేసే చర్యగా కూడా పేర్కొన్నారు. ప్రజల మనోభావాలను రక్షించాలంటే ప్రభుత్వం తక్షణమే స్పందించి శిక్ష కఠినంగా అమలు చేయాలని ఆహ్వానించారు.

# రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట కార్యాచరణ అమలు...





–జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ -22, తెలంగాణ ముచ్చట్లు;** రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన 8వ జిల్లా స్థాయి రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్యలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జిల్లాలోని పట్టణ ప్రాంతాలలో స్థానిక మున్సిపాలిటీలు బాధ్యతలు తీసుకొని రోడ్ల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఖమ్మం నగరంలో 10 రోజుల పాటు ప్రత్యేక కార్యాచరణ చేపట్టి రోడ్ల గుంతలను పూడ్చి వేయడం జరిగిందని తెలిపారు. రోడ్ల గుంతలు పూడ్చివేత నాణ్యతతో జరగాలని, సాంకేతిక విలువను తూ.చ. తప్పకుండా పాటించాలని అన్నారు. కల్లూరు, వైరా, సతుపల్లి, మధిర, ఏదులాపురం మున్సిపాలిటీల పరిధిలో ప్రధాన రోడ్లపై ఉన్న గుంతలను గుర్తించి 15 రోజులలో వాటిని పూడ్చి వేయాలని కలెక్టర్ ఆదేశించారు. నేషనల్ హైవే 365బిబి ఖమ్మం నగరానికి బైపాస్ సెక్షన్ గా ఉంటుందని, ఖమ్మం బైపాస్ వద్ద మరమ్మత్తు పనులు చేపట్టాలని, అక్కడ రోడ్డు భద్రత ప్రమాణాల క్రింద రంబుల్ స్ట్రిప్స్, రేడియం స్టిక్కర్, స్పీడ్ బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారులపై బ్లాక్ స్పాట్స్ గుర్తించి అక్కడ ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. నేషనల్ హైవే పై ఉన్న జంక్షన్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని, అవసరమైన చోట వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఖమ్మం కోదాడ, వరంగల్ జంక్షన్ పరిధిలో ఉన్న స్ట్రెచ్ ను ఆర్ అండ్ బీ అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. వైరాలో ఒక అపార్ట్ మెంట్ రోడ్డుపై సివరేజి వదలడం వల్ల చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలుసుకున్న కలెక్టర్ వెంటనే సంబంధిత యాజమాన్యాలకు నోటీస్ జారీ చేయాలని, 15 రోజులలో అక్కడ యాజమాన్యం సొంత డబ్బులతో ఇంకుడు గుంత నిర్మించి, రోడ్డుపై సీవరేజి రాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. మున్సిపల్, ఎన్.హెచ్, రెవెన్యూ, పోలీస్, ఆర్ అండ్ బీ అధికారులు సంయుక్తంగా అక్టోబర్ 24న బైపాస్ నుంచి కలెక్టరేట్ వరకు ఫీల్డ్ విజిట్ చేపట్టి తీసుకోవాల్సిన చర్యలపై అక్టోబర్ 29 నాటికి రిపోర్ట్ అందించాలని కలెక్టర్ ఆదేశించారు. పట్టణ ప్రాంతాలలో పాఠశాలల వద్ద ఉన్న రోడ్లపై స్కూల్ జోన్, గో స్లో రేడియం స్టిక్కర్లతో కూడిన బోర్డులు ఏర్పాటు చేయాలని, రోడ్లపై వాహనాల వేగం తగ్గించేందుకు రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని, పాఠశాలల యాజమాన్యాలతో మాట్లాడి ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం పాఠశాల గేట్ వద్ద వారి సిబ్బంది ఉంటూ ఎటువంటి ప్రమాదాలు జరగకుండా పర్యవేక్షించేలా ఆదేశాలు జారీ చేయాలని అన్నారు. నగరంలో ఉన్న బస్ బే లను ఆడిట్ చేసి పాదచారులకు ఉపయోగకరంగా తయారు చేయాలని అన్నారు. నగరంలో వాణిజ్య వ్యాపార సంస్థలను తనిఖీ చేసి అక్కడ ట్రాఫిక్ నియంత్రణ బాధ్యతను వారికి అప్పగించాలని అన్నారు. ఏఐ సాంకేతికతను వాడుతూ రాంగ్ సైడ్ డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన సంఘటనలు గుర్తించి వారికి చట్టం ప్రకారం జరిమానాలు విధించాలని, ట్రాఫిక్ నిబంధనలు, ఏఐ సాంకేతిక వినియోగం పట్ల విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ తెలిపారు. జాతీయ రహదారులకు సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లను బలోపేతం చేయడానికి అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రమాదాలు జరిగిన సమయంలో గోల్డెన్ అవర్ లో అవసరమైన చికిత్స వెంటనే అందించి మనుషుల ప్రాణాల సంరక్షణకు చర్యలు చేపట్టాలని అన్నారు. నేషనల్ హైవే పై ఉన్న జంక్షన్ వద్ద హై మాస్ లైట్లు తప్పకుండా వెలగాలని, నగర ప్రాంతంలో ఎక్కడ డార్క్ స్పాట్ ఉండడానికి వీలు లేదని అన్నారు. రోడ్లపై ఎక్కడ భారీ వాహనాలు పార్కింగ్ చేయడానికి వీలు లేదని, దీనికి సంబంధించి లారీ డ్రైవర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్ రవాణా అధికారినీ ఆదేశించారు.
దానవాయిగూడెం రోడ్డు మరమ్మత్తు పనులు ప్రారంభం కాకపోవడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. రోడ్డు మరమ్మత్తు పనులు వెంటనే స్టార్ట్ చేసి త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. భారీ వాహనాల వల్ల జిల్లాలో 18 చోట్ల రోడ్లు దెబ్బతిన్నాయని, వీటిలో మొదటి దశలో 5 రోడ్ల మరమ్మత్తు పనులు చేపట్టుటకు ప్రతిపాదనలు తయారు చేయాలని కలెక్టర్ ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. హిట్ అండ్ రన్ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, జిల్లాలో 17 హిట్ అండ్ రన్ కేసులు జరిగాయని, వీరికి బీమా ప్రకారం పరిహారం అందేలా చూడాలని, మన దగ్గర ఎక్కడ పెండింగ్ లేకుండా చూడాలని అన్నారు. పోలీసు కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ ఎన్.హెచ్. కనెక్టింగ్ రోడ్డు, టీజంక్షన్ వద్ద ఎన్.హెచ్. తరపున రంబుల్ స్ట్రిప్స్, ఆర్ అండ్ బి/ పంచాయతీ రోడ్ల పై స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లాలో పార్కింగ్ లేకుండా నూతన పాఠశాలలకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతి ఇవ్వవద్దని అన్నారు. ప్రతి ప్రైవేట్ పాఠశాల పార్కింగ్ స్పేస్ గుర్తించాలని లేని పక్షంలో భవిష్యత్తులో అనుమతుల రెన్యువల్ నిలిపి వేయాలని అన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ నేషనల్ హైవే వద్ద జరిగిన ప్రమాదాల దృష్ట్యా బ్లాక్ స్పాట్స్ గుర్తించి వాటి సమీపంలో గల ఆసుపత్రు లకు మ్యాచ్ చేయాలని, అక్కడ ట్రామా సెంటర్ ప్రాథమిక సేవలు అందేలా చూడాలని అన్నారు. ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ వర్షాల అనంతరం నగర కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన రోడ్లపై ఏర్పడిన 470 గుంతలను గుర్తించి ఇప్పటి వరకు 350 పూడ్చి వేత పూర్తి చేశామని అన్నారు. 6 ప్యాకేజి లలో టెండర్లు ఫైనల్ చేసి పనులు చేపట్టామని, కోల్డ్ మిక్స్ సాంకేతికతో తాత్కాలికంగా రోడ్ల మరమ్మత్తులు పూర్తి చేశామని అన్నారు. నగరంలోని 16 కిలోమీటర్లు ప్రధాన రోడ్లలో నేషనల్ హైవే తరహాలో లైన్ మార్కింగ్ , జిబ్రా క్రాసింగ్ వేయడం జరుగుతుందని, దీనికి టెండర్లు పిలిచామని రెండు నెలల్లో ఈ పని పూర్తి చేస్తామని అన్నారు. ప్రైవేట్ పాఠశాలలు, విద్యా సంస్థల సమీపంలో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేస్తున్నామని, ఫుట్ పాత్ పై పాదచారులు ప్రయాణించేలా సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. ఈ సమావేశంలో డి.ఆర్.ఓ. ఏ. పద్మశ్రీ, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకుబ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డా. కళావతి బాయి, జిల్లా రవాణా అధికారి వెంకట రమణ, నేషనల్ హై వే పిడి లు రామాంజనేయ రెడ్డి, దివ్య, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, ఆర్టీఓ, పోలీసు, మునిసిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# డ్యూటీలోనే విద్యుత్ షాక్... ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ప్రాణం కోసం కుటుంబం పోరాటం!






**సత్తుపల్లి, అక్టోబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** విద్యుత్ శాఖ నిర్లక్ష్యం మరోసారి పేద కుటుంబాన్ని దారుణ పరిస్థితుల్లోకి నెట్టింది. ఖమ్మం జిల్లా వేంసూరు మండలం దిద్దుపూడి గ్రామానికి చెందిన జుంజునూరి వెంకటేశ్వరరావు (32) అనే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి డ్యూటీ సమయంలో విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం ఆయన హైదరాబాదులోని యశోద ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నాడు.
వివరాల్లోకి వెళ్తే —— అక్టోబర్ 10న దిద్దుపూడి గ్రామానికి చెందిన భూషణం అనే రైతు పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని ఫిర్యాదు చేయడంతో, వెంకటేశ్వరరావు కందుకూరు సబ్‌స్టేషన్ నుండి లైన్ క్లియరెన్స్ (ఎల్‌సీ) తీసుకుని మరమ్మతు పనులు ప్రారంభించాడు. అయితే పనులు కొనసాగుతున్న సమయంలోనే ఎవరైనా విద్యుత్ సరఫరా పునరుద్ధరించడంతో 11 కెవి తీగలు తగిలి ఆయన నేలకొరిగాడు. తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వరరావును సహచరులు ఖమ్మం ఆసుపత్రికి తరలించగా, వైద్యుల సూచన మేరకు అనంతరం హైదరాబాద్ సోమాజిగూడ యశోద ఆసుపత్రికి తరలించారు.
ఈ ప్రమాదంలో వెంకటేశ్వరరావు రెండు చేతులు తీవ్రంగా దెబ్బతినడంతో వైద్యులు ఒక చేయిని తొలగించాల్సి వచ్చింది. గుండె సమస్య తలెత్తడంతో హార్ట్ సర్జరీ అవసరమని వైద్యులు తెలిపారు. మొత్తం చికిత్స ఖర్చు సుమారు రూ.27 లక్షల వరకు అవుతుందని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
"నా కొడుకు డ్యూటీలో ఉండగానే షాక్ తగిలి ఇలా అయ్యాడు. రెండు చేతులు కాలిపోయాయి, ఒక చేయి తీసేయాల్సి వచ్చింది. ఇంత పెద్ద ప్రమాదం జరిగినా విద్యుత్ శాఖలో ఒక్క అధికారి ఆసుపత్రికి రాలేదు. నా కొడుకు ప్రాణానికి విలువ లేదా?" అని వెంకటేశ్వరరావు తండ్రి కన్నీటి పర్యంతమయ్యారు.
వెంకటేశ్వరరావు అన్న జుంజునూరి రఘు, ఆర్మీ సైనికుడు, మాట్లాడుతూ – "నేను దేశ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్నా. నా



తమ్ముడు కుటుంబాన్ని చూసుకుంటాడు. కానీ ఈ రోజు వాడే ఇలా అవుతాడని ఊహించలేదు. యాజమాన్యం లైన్ క్లియరెన్స్ ఇచ్చి పని చేస్తున్న వ్యక్తిపై విద్యుత్ సరఫరా ఎలా జరిగిందో చెప్పాలి. ఇది ప్రమాదం కాదు, ఉద్దేశ్యపూర్వకంగా చేసిన పని," అని ఆవేదన వ్యక్తం చేశాడు.
గ్రామ ప్రజలు కూడా విద్యుత్ శాఖ నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇంత పెద్ద ప్రమాదం జరిగినా అధికారులు స్పందించకపోవడం మనసు కలిచివేస్తోంది. ప్రభుత్వం ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందించాలి," అని వారు డిమాండ్ చేశారు.
కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కలిసి మర్లపాడు గ్రామంలో గల వేంసూరు అసిస్టెంట్ ఇంజినీర్ కార్యాలయం ఎదుట రాస్తారోకో నిర్వహించారు.
"ఏడీ, లైన్‌మన్ గంధం వెంకటేశ్వరరావు, ఆపరేటర్ మాధవరెడ్డి - వీరు ఎల్‌సీ సమయంలో ఫోన్ కాంటాక్ట్‌లో ఉన్నారా లేదా? అనే విషయంపై పూర్తి విచారణ జరిపి నిర్లక్ష్యం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి," అని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు.
ప్రస్తుతం జుంజునూరి వెంకటేశ్వరరావు యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. వైద్య ఖర్చుల భారంతో కుటుంబం తీవ్ర ఇబ్బందులు పడుతోంది. ప్రభుత్వం ముందుకు వచ్చి సాయం అందించాలని స్థానికులు కోరుతున్నారు.



## ముఖ్యమంత్రి సహాయనిధి దరఖాస్తులు సమర్పించిన: ఎమ్మెల్యే జారె

**అశ్వారావుపేట, అక్టోబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** అశ్వారావుపేట నియోజకవర్గానికి చెందిన అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ఆర్థిక సాయం అందించేందుకు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ కృషి కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి కోసం స్వీకరించిన 120 దరఖాస్తులను సంబంధిత అధికారులకు స్వయంగా అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద ప్రజలకు వైద్య సేవలు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అగ్రగామిగా ఉంటుందని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతి కుటుంబం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఉపశమనాన్ని పొందేలా నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే జారె తెలిపారు.

అలాగే వైద్య చికిత్స అవసరమున్న ప్రతి అర్హత కలిగిన కుటుంబం తమ వివరాలను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి అందజేయాలని సూచించారు. వారికి ప్రభుత్వం ద్వారా ఉచిత వైద్య సహాయం అందేలా తాను వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తానని తెలిపారు.




## తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ అభివృద్ధికి పక్కా ప్రణాళిక...

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 22, తెలంగాణ ముచ్చట్లు;** తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ అభివృద్ధికి పక్కా ప్రణాళికలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ మధిర నియోజకవర్గంలోని ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మధిర మండలం మహాదేవపురం జెడ్పి హెచ్ఎస్, చింతకాని మండలం నాగులవంచ జెడ్పి హెచ్ఎస్ పాఠశాలలను తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ గా అభివృద్ధి చేసేందుకు పైలెట్ ప్రాజెక్టు క్రింద ఎంపిక చేయడం జరిగిందని అన్నారు. పైలెట్ ప్రాజెక్టు క్రింద ఎంపిక చేసిన పాఠశాలల హెడ్ మాస్టర్ లు వెంటనే పాఠశాల అభివృద్ధి నిర్వహణ కమిటీ పేరిట ప్రత్యేక బ్యాంక్ ఖాతా ప్రారంభించాలని, దీనికి లీడ్ బ్యాంకు మేనేజర్ అవసరమైన సహకారం అందించాలని అన్నారు. ఖమ్మం సమగ్ర శిక్ష ఫైనాన్స్ అకౌంట్ ఆఫీసర్ డెమో ప్రాజెక్ట్ స్కూల్ ఎడ్యుకేషన్ పేరిట కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి ఉపయోగించే విధంగా జాయింట్ బ్యాంకు అకౌంట్ ఓపెన్ చేయాలని అన్నారు. నూతనంగా వచ్చిన 7 కోట్ల 18 లక్షల రూపాయలను డెమో ప్రాజెక్టు స్కూల్ ఎడ్యుకేషన్ జాయింట్ బ్యాంక్ అకౌంట్ లో జమ చేసేందుకు ప్లానింగ్ శాఖ నుంచి అనుమతి తీసుకోవాలని కలెక్టర్ ముఖ్య ప్రణాళిక అధికారిని ఆదేశించారు. రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో ఉన్న తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ లను సమగ్ర శిక్ష అభియాన్ ప్లానింగ్ కోఆర్డినేటర్, మండల విద్యాశాఖ అధికారులు సంబంధిత పాఠశాలల హెడ్ మాస్టర్ లు అక్టోబర్ నెలలో క్షేత్రస్థాయిలో పర్యటించి స్టడి చేయాలని అన్నారు. అక్టోబర్ 26 నాటికి మొదటి విడత క్రింద ప్రతి పాఠశాలకు 20 లక్షల రూపాయలు విడుదల చేయాలని కలెక్టర్ తెలిపారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ బనిగండ్లపాడులో అభివృద్ధి పనులకు అక్టోబర్ 25 న డిప్యూటీ సిఎం చేతుల మీదుగా శంకుస్థాపన చేసే విధంగా అవసరమైన కార్యాచరణ పూర్తి చేయాలని కలెక్టర్ ఈఈ ను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ విద్యా శాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ సి.హెచ్. రామకృష్ణ, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఒకవైపు అద్భుతమైన చౌరస్తా మరోవైపు గుంతలతో నిండిన రహదారి





**ఎల్కతుర్తి, అక్టోబర్22(తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండల కేంద్రంలోని చౌరస్తాను అధికారులు ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. పూల మొక్కలు, పచ్చదనం, రాత్రివేళ వెలుగులు చిమ్మే లైట్లతో చౌరస్తా అందంగా కనిపిస్తోంది. అయితే అదే చౌరస్తాకు కూతవేటు దూరంలో ఉన్న ఎల్కతుర్తి-హుస్నాబాద్ ప్రధాన రహదారి మాత్రం దారుణ పరిస్థితుల్లో ఉంది. మధ్యలోనే రహదారి పనులు ఆపివేయడంతో దుమ్ము, ధూళి, గుంతలతో మారుమూల గ్రామాల రోడ్లకంటే దారుణంగా మారిపోయింది. ప్రధాన రహదారి కావడంతో తరచూ వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఎన్ని ప్రమాదాలు జరిగినా, ఎన్ని సార్లు ప్రజలు ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారిని వెంటనే పూర్తి చేసి ప్రజలకు ఉపశమనం కల్పించాలని వారు కోరుతున్నారు.

### దుమ్ము, ధూళితో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం: స్థానికురాలు ఎండి యాకూబి

స్థానికురాలు ఎండి యాకూబి మాట్లాడుతూ "ఎల్కతుర్తి–హుస్నాబాద్ రహదారి మధ్యలోనే ఆపేయడంతో దుమ్ము ధూళితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. తినే ఆహార పదార్థాల్లో కూడా దుమ్ము పడుతోంది. ఊపిరి పీల్చుకోవడమే కష్టంగా మారింది. ఈ రహదారి వెంటనే పూర్తి చేయాలని అధికారులను కోరుతున్నాం" అని వాపోయారు.



# పాఠశాలల్లో ఉన్న పెండింగ్ అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి...





### స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ -22, తెలంగాణ ముచ్చట్లు;** పాఠశాలల్లో పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనుల పురోగతిపై బుధవారం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ జిల్లాలో 44 ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు పెండింగ్ ఉన్నాయని తెలిపారు. పెండింగ్ పనులు పూర్తి చేసి ఎంబీ రికార్డులు వివరాలు నమోదు చేస్తే వెంటనే బిల్లులు విడుదల చేయడం జరుగుతుందని అన్నారు. 44 పాఠశాలల్లో పనుల పురోగతి వివరాలను పాఠశాలల వారిగా రివ్యూ చేసి అదనపు కలెక్టర్ పలు సూచనలు చేశారు. అక్టోబర్ నెలాఖరు వరకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను తప్పనిసరిగా పూర్తి చేయాలని అన్నారు. గ్రామాలలో పాఠశాలకు నీరు సరఫరా లేని పక్షంలో సమీపంలో మిషన్ భగీరథ పైప్ లైన్ నుంచి కనెక్షన్ అందించాలని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనుల సకాలంలో పూర్తి కాని పక్షంలో సంబంధిత పాఠశాల సిబ్బంది, ఇంజనీరింగ్ అధికారుల వేతనంలో కోత విధించడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో విద్యా శాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ సి.హెచ్. రామకృష్ణ, ఎంపీడీఓలు, ఎం.ఈ.ఓ. లు, సంబంధిత పాఠశాలల హెడ్ మాస్టర్ లు, ఏఈలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి రాజీవ్ నగర్‌లో మైనర్ బాలుడు అదృశ్యం

**సత్తుపల్లి, అక్టోబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీ 11వ రోడ్‌లోని వాసముండే 15 ఏళ్ల గువ్వల రమణ, 8వ తరగతి విద్యార్థి, గత నాలుగు రోజులుగా కనిపించడంలేదు. చిన్నతనంలో తల్లిదండ్రులను కోల్పోయిన రమణ, తన అమ్మమ్మ గువ్వల సావిత్రి సంరక్షణలో పెరిగాడు. పండుగ సందర్భంగా రాజీవ్ నగరంలో బతుకమ్మ వేడుకలలో డీజే ఏర్పాటు చేశారు. వేడుక ముగిసిన తర్వాత, డీజేకు సంబంధించిన వ్యక్తులు రమణ ఇంటికి వచ్చి, డీజే బాక్స్‌ల కోసం 9,000 రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అవసరం అయిన సంతకాలను పెట్టకపోతే రమణను హిజ్రాల వద్దకు తీసుకెళ్ళి ఇంజక్షన్ ద్వారా పనికిరాని వ్యక్తిగా చేస్తామని బెదిరించారు. బెదిరింపుని భయపడి రమణ నాలుగు రోజులుగా ఇంటికి రాలేదని, గువ్వల సావిత్రి సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి, బాలుడిని వెతికే చర్యలు ప్రారంభించారు.



# భారీ వర్షాలకు కూలిన ఇల్లు

- కడలూరులో ఇద్దరు మహిళల మృతి
- కుండపోత వర్షా లు, విషాదం
- ఏపీ, తమిళనాడు జిల్లాలకు రెడ్ అలర్ట్
- సహాయక చర్యలు ముమ్మరం



తమిళనాడు రాష్ట్రంలో కుండపోత వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఎడతెగని వర్షాల కారణంగా రాష్ట్రం అతలాకుతలం అవుతోంది. ఈ భారీ వర్షాల ప్రభావంతో కడలూరు జిల్లాలో విషాదకర సంఘటన చోటు చేసుకుంది. కుండపోత వర్షాలకు అక్కడ ఒక నివాసం కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఆ ఇంట్లో ఉన్న ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం రాబోయే 24 గంటల్లో తీరం దాటే అవకాశం ఉన్నందున తమిళనాడుతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని దక్షిణ కోస్తా జిల్లాల్లోనూ అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం అంతకుముందే హెచ్చరికలు జారీ చేసింది. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఐఎండీ తమిళనాడులోని చెంగల్‌పట్టు, విల్లుపురం, కడలూరు, మైలాడుతురై జిల్లాలకు రెడ్ అలర్ట్‌ను ప్రకటించింది. అదే సమయంలో, ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు, ప్రకాశం, తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు, కడప జిల్లాలకు కూడా రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఇంకా, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్‌ను ప్రకటించింది. రాబోయే 24 గంటల వ్యవధిలో 20 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున, ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అధికారులు పదే పదే హెచ్చరికలు జారీ చేశారు. భారీ వర్షాల ముప్పు నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం సహాయక చర్యలను ముమ్మరం చేసింది. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆదేశాల మేరకు, రెడ్ అలర్ట్ జారీ అయిన జిల్లాలకు పర్యవేక్షకులుగా 12 మంది సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, వారికి అవసరమైన సహాయక శిబిరాలను సిద్ధంగా ఉంచాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. చెంగల్‌పట్టు కలెక్టర్ డి స్నేహ మాట్లాడుతూ, వర్షాలకు ముందే పూడికతీత పనులు పూర్తి చేశామని, నీటిని తోడే పంపులు, సహాయక కేంద్రాలు, కమ్యూనిటీ కిచెన్లు వంటివి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. భారీ వర్షాల కారణంగా తమిళనాడులోని 13 జిల్లాల్లో పాఠశాలలకు, కళాశాలలకు సెలవులు ప్రకటించారు. తూత్తుకూడి, తిరువారూర్ జిల్లాల్లోని పలు లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా నాగపట్నం, తిరువారూర్ జిల్లాల్లో వేలాది ఎకరాల్లో వరి పొలాలు నీట మునగడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జేసీబీలు, బోట్లు, చెట్లను తొలగించే యంత్రాలు సహా జాతీయ విపత్తు స్పందన దళం బృందాలను అన్ని ప్రాంతాల్లో సిద్ధంగా ఉంచారు.



# హై హీల్స్ ధరించడం.. ఇంత ప్రమాదమా..?

మనలో చాలామంది హై హీల్స్ ధరించడం చాలా స్టైలిష్‌గా ఉంటుందని అందాన్ని కూడా పెంచుతుందని భావించి ఎక్కువగా వీటిని వేసుకుంటూ ఉంటారు మహిళలు.. అయితే ఇది చాలా ప్రమాదకరమని నిపుణులు సైతం తెలియజేస్తున్నారు.అందుకు కారణం మన శరీరంలో చాలా చోట్ల నొప్పి అనుభవించాల్సి ఉంటుందట.. చాలామంది వైద్యులు హై హీల్స్ వాడకాన్ని తగ్గించాలని మహిళలకు సూచిస్తూ ఉన్నారు.. హై హీల్స్ ధరించడం వల్ల చాలా ఇబ్బందులను కూడా ఎదుర్కొంటారని అందుకు కారణలు కూడా తెలియజేశారు. ముఖ్యంగా హై హీల్స్ ని వేసుకున్నప్పుడు బ్యాలెన్స్ చేయలేరని దీనివల్ల వీపులో వాపు, నొప్పి వస్తుందని తెలియజేస్తున్నారు.. హై హీల్స్ ధరించడం అందంగా కనిపించిన.. ముఖ్యంగా మడమలకు అసౌకర్యాన్ని కలిగిస్తాయని.. పాదాలలో నొప్పిని కూడా కలిగిస్తాయని కాలి మడమ వంపు అరికాలి లేదా కాలివేల మధ్య కూడా చాలా ఇబ్బందులు తలెత్తలా చే స్తా యని


మా యం అవుతుంది. దీంతో బాడీకి ఐరన్ లభిస్తుంది.

నిపుణులు సైతం తెలియజేస్తున్నారు. హై హీల్స్ ధరించడం వల్ల వెన్నునొప్పి చాలా తీవ్రంగా వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాగే ఎముకల పైన మోకాళ్ళ పైన చాలా ప్రభావాన్ని సైతం చూపిస్తుందట. ముఖ్యంగా హై హీల్స్ వేసుకోవడం వల్ల మోకాలి కీలు పైన భారీ ఒత్తిడి ఏర్పడుతుందని దీనివల్ల త్వరగా నే మోకాళ్ల నొప్పులకు కూడా దారితీస్తుందని తెలుపుతున్నారు.. అలాగే నడుము, తుంటి చుట్టునొప్పి కలిగేలా చేస్తాయని కీళ్ల నొప్పులు కూడా త్వరగా ఏర్పడతాయని.. అలాగే కండరాలలో నొప్పి కూడా కలుగుతుందని అరికాళ్ళలో మంటలు కూడా కలిగిస్తుందని వైద్యులు తెలియజేస్తున్నారు.. కొన్ని సందర్భాలలో ఈ ప్రెషర్ కి తలనొప్పి కూడా చాలా ఎక్కువగా వస్తుందని తెలియజేస్తున్నారు.

# వీటిని తింటే రక్తహీనత తగ్గుతుంది?

మన బాడీ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే మనకు అనేక రకాల విటమిన్లు, మినరల్స్ ఖచ్చితంగా చాలా అవసరం. వాటిల్లో ఐరన్ అనేది ఖచ్చితంగా చాలా అవసరం. ఐరన్ మన శరీరానికి చాలా రకాలుగా ఉపయోగపడుతుంది.ఇది హిమోగ్లోబిన్ ఉత్పత్తికి సహాయపడుతుంది. ఇంకా అలాగే రక్తం ఎక్కువగా తయారయ్యేలా చేస్తుంది. రోగ నిరోధక శక్తిని పెంచడంలో కూడా సహాయం చేస్తుంది. అందువల్ల ఐరన్ ఉండే ఆహారాలను మనం ప్రతి రోజూ ఖచ్చితంగా తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఐరన్ వేటిలో ఉంటుంది? అని మీరు సందేహ పడాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఇప్పుడు చెప్పబోయే ఈ గింజలను ప్రతి రోజూ తింటే చాలు, దాంతో మన శరీరానికి ఐరన్ పుష్కలంగా లభిస్తుంది. దీని వల్ల పైన తెలిపిన ప్రయోజనాలు మన శరీరానికి కలుగుతాయి. ఇక ఐరన్ అధికంగా ఉండే ఆ గింజలు గురించి ఇప్పుడు మనం పూర్తిగా తెలుసుకుందాం. అవిసె గింజలను ఆహారంలో భాగం చేసుకుంటే రక్త హీనత సమస్య ఈజీగా

ఇది మనల్ని ఎంతో ఆరోగ్యంగా ఉంచుతుంది. అలాగే పొద్దుతిరుగుడు విత్తనాలను కూడా ఆహారంలో చేర్చుకోవచ్చు. వీటి ద్వారా కూడా మనకు ఐరన్ లభిస్తుంది. 1 ఔన్సు పొద్దు తిరుగుడు గింజలను తింటే సుమారుగా 1.4 మిల్లీగ్రాముల ఐరన్ లభిస్తుంది. దీంతోపాటు విటమిన్ ఇ, మెగ్నిషియం, సెలీనియం వంటి ముఖ్యమైన పోషకాలు కూడా లభిస్తాయి.నువ్వులను రోజూ తినడం వల్ల కూడా మనకు ఐరన్ పుష్కలంగా లభిస్తుంది. ఒక టేబుల్ స్పూన్ నువ్వులను తిన్నా చాలు 1.3 మిల్లీగ్రాముల ఐరన్ లభిస్తుంది. అలాగే క్యాల్షియం, మెగ్నిషియం, కాపర్ కూడా మనకు నువ్వుల ద్వారా లభిస్తాయి. ఇవి మనల్ని ఆరోగ్యంగా ఉంచడంలో ఎంతగానో సహాయపడతాయి.అలాగే ఐరన్ ఎక్కువగా ఉండే గింజల్లో గుమ్మడికాయ గింజలు కూడా ఒకటి. ఒక ఔన్సు గుమ్మడికాయ విత్తనాలను తింటే 2.5 మిల్లీగ్రాముల ఐరన్ లభిస్తుంది. మనకు రోజుకు కావల్సిన ఐరన్‌లో ఇది 14 శాతంగా ఉంటుంది. అందువల్ల రోజూ ఈ గింజలను తినాలి. దీంతో మనకు మెగ్నిషియం, జింక్, ఆరోగ్యకరమైన కొవ్వులు కూడా లభిస్తాయి. అలాగే ఇతర ఆరోగ్య ప్రయోజనాలు కూడా కలుగుతాయి. కాబట్టి ప్రతి రోజూ గుమ్మడి గింజలను తినాలి.



# మేకపాలు తాగడం వల్ల లాభాలు..

సాధారణంగా మనం ప్రతిరోజు తాగే పాలలో కేవలం గేదె పాలు, ఆవు పాలు మాత్రమే ఎక్కువగా తాగుతూ ఉంటాము.. చాలామంది మేకపాలు తీసుకోవడం కూడా జరుగుతూ ఉంటుంది.అయితే మేక పాలు తాగడం వల్ల కూడా చాలా ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. వాటి గురించి చూద్దాం. మేక పాలు తాగడం వల్ల సులువుగా అవి జీర్ణం అవుతాయి.. ముఖ్యంగా ఇవి ఎన్నో రకాల ప్రోటీన్స్ కలిగి ఉంటాయి.. గేదె పాల కంటే మేక పాలు మరింత శ్రేష్టమైనవిగా చెప్పవచ్చు. మేక పాలల్లో చాలా తక్కువ కొవ్వు పదార్థాలు కలిగి ఉంటాయి. అలాగే ఇందులో చాలా పోషకాలు కూడా కలిగి ఉంటాయి.. మేక పాలలో క్యాల్షియం కూడా చాలా ఎక్కువ మోతాదులోనే లభిస్తుంది. శరీరానికి బలంగా ఉంచడంలో మేకపాలు చాలా కీలకమైన పాత్రలు పోషిస్తాయి. మేక పాలలో విటమిన్స్ పుష్కలంగా ఉండటమే కాకుండా పొటాషియం ,ఫాస్ఫరస్ ఖనిజాలు కూడా లభిస్తాయి.మేక పాలు తాగడం వల్ల శరీరానికి వెంటనే ఇమ్యూనిటీ బూస్ట్ కూడా అందిస్తుంది... ఇందులో విటమిన్ ఏ ఉండడం వల్ల ఎలాంటి ఇన్ఫెక్షన్ రాకుండా అడ్డుకుంటుంది. తరచూ మేకపాలు తాగడం వల్ల ఇమ్యూనిటీ వ్యవస్థ కూడా చాలా బలపడుతుందట.చర్మం పైన మచ్చలు ఉన్న లేకపోతే రఫ్ గా ఉన్న మేకపాలతో మసాజ్ వంటివి చేస్తే ఇందులో ఉండే ఖనిజాలు చర్మం పైన హైడ్రేటుగా మారి మృదువుగా చేస్తాయి.మేక పాలలో కొవ్వు పదార్థాలు శరీరానికి అవసరమైనవి ఉంటాయి..మేక పాలలో పొటాషియం ఉండడం వల్ల త్వరగా బ్లడ్ ప్రెషర్ లెవెల్స్ ని అదుపులో ఉంచేలా చేస్తుంది. మేక పాలు తాగడం వల్ల డయేరియా ,మలబద్ధక వంటి సమస్యలకు సైతం చెక్ పెట్టవచ్చు. శరీరానికి అవసరమైన మంచి బ్యాక్టీరియాని కూడా పెంచడానికి మేకపాలు సహాయపడతాయి.. మేక పాలు ఇచ్చేది తక్కువైన లాభాలు మాత్రం మెండుగానే ఉంటాయి.



# ఈ టీ తాగితే ఎంతో ఆరోగ్యంగా ఉంటారు?



మనలో చాలా మందికి టీ తాగనిదే రోజు గడవదు. అయితే సాధారణ టీ హెల్త్ కి అంత మంచిది కాదు. దానికి బదులు కరివేపాకు టీ తాగితే చాలా హెల్తీగా ఉంటారు. అదెలా చేసుకోవాలి?దానివల్ల కలిగే ప్రయోజనాల గురించి ఇప్పుడు మనం తెలుసుకుందాం.. ముందుగా మీరు ఒక గిన్నెలో నీరు పోసి మరిగించండి. నీరు మరిగిన తర్వాత, కరివేపాకు ఆకులను వేసి 2 నిమిషాలు ఉడికించాలి. స్టవ్ ఆఫ్ చేసి, టీని 5 నిమిషాలు నానినట్లు ఉంచండి. టీని వడగట్టి, ఒక కప్పులోకి పోయాలి. రుచికి తగినట్లుగా తేనె లేదా నిమ్మరసం కలపండి. వేడిగా లేదా గోరువెచ్చగా తాగండి. ఇందులో ఒక చిన్న ముక్క అల్లం లేదా 23 యాలకులను కూడా వేసి ఉడికించవచ్చు.మీరు టీని మరింత గాఢంగా చేయాలనుకుంటే, మీరు ఎక్కువ కరివేపాకు ఆకులను ఉపయోగించవచ్చు.టీని వడగట్టడానికి, మీరు ఫిల్టర్ లేదా సన్నని గుడ్డను ఉపయోగించవచ్చు.ఈ కరివేపాకు టీని రోజుకు ఒకసారి లేదా రెండుసార్లు తాగవచ్చు.కరివేపాకు టీ ఒక రుచికరమైన , ఆరోగ్యకరమైన పానీయం, ఇది అనేక ప్రయోజనాలను అందిస్తుంది.రక్తం పలుచబడే మందులు వాడే వ్యక్తులు కూడా కరివేపాకు టీని తాగడానికి ముందు వైద్యుడిని సంప్రదించాలి.అలాగే గర్భిణీ స్త్రీలు లేదా పాలిచ్చే మహిళలు కరివేపాకు టీని తాగడానికి ముందు వైద్యుడిని సంప్రదించాలి. ఈ టీ తాగడం వల్ల జుట్టు రాలకుండా ఉంటుంది. అలాగే ఆరోగ్యంగా , ఒత్తుగా పెరుగుతుంది. దీని వల్ల ఎలాంటి జుట్టు సమస్యలు కలగకుండా ఉంటుంది. కరివేపాకు టీ ఒత్తిడి, ఆందోళనలను కూడా తగ్గిస్తుంది. ఇది ఒక రిలాక్సెంట్‌గా పనిచేస్తుంది. ముఖ్యంగా మహిళలు రుతుస్రావ నొప్పిని తగ్గిస్తుంది. ఇది రుతుస్రావ నొప్పి, అసౌకర్యాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. అలాగే ఈ టీతో అధిక బరువు సమస్యకు చెక్ పెట్టవచ్చు. శరీరంలోని కొవ్వును కరిగించడంలో ఎంతో సహాయపడుతుంది. అలాగే ఆహారాని త్వరగా జీర్ణం చేస్తుంది. దీని వల్ల జీర్ణక్రియ కూడా మెరుగుపడుతుంది. దీని వల్ల చర్మానికి కూడా ఎంతో ఉపయోగపడుతుంది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షిస్తుంది.

# నిద్రలేమితో ఇబ్బంది పడుతున్నారా..



నిద్రలేమి ఏ వ్యక్తికైనా మానసిక క్షోభను కలిగిస్తుంది. అలాగే శారీరక ఆరోగ్యం పై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుంది. తగినంత నిద్ర లేకపోవడం వల్ల, మానసిక స్థితి చికాకుగా మారుతుంది. ఒత్తిడి పెరుగుతుంది. అంతే కాదు తగినంత నిద్ర లేకపోతే ఊబకాయం కూడా పెరగడం ప్రారంభమవుతుంది. దీని కారణంగా వ్యక్తి అనేక తీవ్రమైన వ్యాధులకు గురవుతారు. కాబట్టి ప్రతి రోజూ తగినంత నిద్ర పొందడం చాలా ముఖ్యం. ఈ రోజుల్లో, పని, ఫోన్ వినియోగం లేదా పార్టీ మొదలైన వాటి కోసం రాత్రిపూట మేలుకోవడం ఆరోగ్యానికి చాలా హానికరమైన ఆధునిక జీవనశైలి సంస్కృతిగా మారింది. రాత్రి పడుకునేటప్పుడు నిద్రలో తరచుగా ఆటంకాలు ఎదురవుతున్నా లేదా పడుకున్న తర్వాత కూడా నిద్రపోలేకపోతే కొన్ని చిట్కాలను పాటించవచ్చు. మీరు రాత్రిపూట మీ ఫోన్‌ని ఉపయోగించడం అలవాటు చేసుకున్నట్లయితే మీ నిద్ర విధానం చెదిరిపోతుంది. చాలా సార్లు, ఫోన్ ఆన్ చేసిన తర్వాత నిద్రపోరు. ఎందుకంటే స్క్రీన్ నుంచి వెలువడే కాంతి మెలటోనిన్ హార్మోన్ ఉత్పత్తికి ఆటంకం కలిగిస్తుంది. దీని కారణంగా నిద్రలేమి సమస్య వస్తుంది. రాత్రి నిద్రించడానికి 1 లేదా 2 గంటల ముందు మీ ఫోన్ లేదా కంప్యూటర్‌ని దూరంగా ఉంచండి. స్క్రీన్ టైమింగ్ తక్కువగా ఉండేలా ప్రయత్నించండి. నిద్రను ప్రోత్సహించడానికి మీరు ఉదయం అశ్వగంధ టీని త్రాగవచ్చు. రాత్రి చామంతి టీ తాగడం ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ హెర్బల్ టీ మెలటోనిన్ (నిద్రకు అవసరమైన హార్మోన్)ను పెంచడమే కాకుండా ఒత్తిడిని పెంచే కార్టిసాల్ హార్మోన్‌ను తగ్గిస్తుంది. దీంతో ప్రశాంతంగా నిద్రపోగలుగుతున్నారు. మీరు నిద్రలేమి సమస్యతో ఇబ్బంది పడుతుంటే, ప్రతిరోజూ ఉదయం సూర్య నమస్కారం చేయడం అలవాటు చేసుకోండి. దీనితో మీరు పూర్తిగా ఫిట్‌గా, ఆరోగ్యంగా ఉండగలుగుతారు. అదే సమయంలో ఇది శరీరంలో కార్టిసాల్, మెలటోనిన్ ఉత్పత్తిని సమతుల్యం చేయడంలో కూడా సహాయపడుతుంది. దీని కారణంగా మనం నిద్రలేమి సమస్య నుంచి బయటపడవచ్చు. మంచి నిద్ర కోసం, మీరు పడుకునే ముందు బెడ్ పై బలాసనా చేయవచ్చు. ఇది మనస్సును రిలాక్స్ చేయడంలో సహాయపడుతుంది. అంతే కాదు మంచం మీద మాత్రమే శ్వాస తీసుకోండి. ఈ యోగాసనంలో చేతులు, కాళ్ళు పూర్తిగా వదులుగా ఉంటాయి.

## ఉదయం లేవగానే తల నొప్పి వస్తోందా...!



నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మారుతున్న జీవనం విధానం కారణంగా ఎన్నో ఆరోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. ప్రజెంట్ చాలా మంది బిజీ బిజీగా ఉండటంతో సమయానికి ఆహారం తీసుకోకపోవడం, సరిగా నిద్ర లేకపోవడం, వ్యాయామం చేయకపోవడం వంటి ఎన్నో కారణాల వల్ల ఆరోగ్య సమస్యలు పెరిగిపోతున్నాయి.మార్నింగ్ లేచి హడావుడిగా ఆఫీస్‌కి బయలుదేరతారు. ఆఫీస్ అయిపోయాక మళ్లీ ఇంటికి వచ్చి రాత్రింత ఫోన్ చూస్తు గడుపుతారు. ఇక శరీరానికి కావల్సిన విశ్రాంతి లేక అనేక అనారోగ్య సమస్యలు వస్తాయి. ఈ క్రమంలో నిద్రలేమి, మానసిక ఒత్తిడి, బద్ధకం, అలసట వంటి ఎన్నో సమస్యలు వస్తాయి. చాలా మంది ఉదయం నిద్ర లేవగానే తల నొప్పితో బాధపడుతూ ఉంటారు. ఉదయం నిద్ర లేవగానే బ్రష్ చేసిన కూడా కొందరికి తల నొప్పి వస్తుంది. మరికొందరికి అయితే మార్నింగ్ లేస్తే ఆ రోజంతా తల నొప్పి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో ఈ సమస్య కాస్త అధికంగానే ఉంటుంది అని చెప్పవచ్చు. అయితే ఇలా ఉదయాన్నే తలనొప్పి రావడానికి చాలానే కారణాలు ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. నిద్రలేమి, డీహైడ్రేషన్, ఒత్తిడి, శరీరంలో ఆక్సిజన్ లెవెల్స్ తగ్గడం, రక్తం తక్కువగా ఉండడం, శరీరంలో నీటి శాతం తక్కువగా ఉండడం.. ఇలా చాలా కరణలనే చెప్పుకోవచ్చు. ఇక నైట్ అంత పని చేసే వారికి ఉదయం లేవగానే ఈ తలనొప్పి సమస్య ఎక్కువగా వేదిస్తూ ఉంటుంది.

## అతిగా చక్కెర తింటున్నారా..



చక్కెర అంటే ఇష్టపడని వారు ఉండరు. అయితే ఇది లిమిట్‌గా తింటే ఎలాంటి ప్రమాదం ఉండదు కానీ, అతిగా తింటే మాత్రం ముప్పు తప్పదు అంటున్నారు ఆరోగ్య నిపుణులు. వైట్ షుగర్ అతిగా తీసుకోవడం వలన అనేక అనారోగ్య సమస్యలు వస్తాయంట. అందువలన వైద్యులు వైట్ షుగర్‌కు చాలా దూరంగా ఉండాలని చెప్పుకొస్తుంటారు. కాగా, అతిగా షుగర్ తినడం వలన ఎలాంటి అనారోగ్య సమస్యలు వస్తుంటాయి. దీని వలన కలిగే ఇబ్బందులు ఏవో ఇప్పుడు తెలుసుకుందాం.అధికంగా వైట్ షుగర్ తీసుకోవడం వలన అది మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతోందంట. దీని వలన మన మెదడులోని డొపమైన్ విడుదలకు కారణం అవుతోంది. దీంతో చాలా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందంట.చక్కెర లివర్ పై తీవ్ర ప్రభావం చూపిస్తుందంట. వైట్ షుగర్ అధికంగా తీసుకోవడం వలన లివర్ ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉంటుంది అంటున్నారు వైద్యులు. ఎక్కువగా షుగర్ తీసుకోవడం వలన రక్తప్రసరణలో ఇన్సులిన్ ప్రభావం చెందుతుంది. ఇది అర్టెరీ బ్లాక్కి దారితీసి, కొన్ని సమయాల్లో గుండె పోటు కూడా రావచ్చును. అధిక మోతాదులో షుగర్ తినేవారిలో స్కిన్ సంబంధిత సమస్యలు కూడా వస్తాయి. అంటే త్వరగా వృద్ధాప్యం రావడం వంటివి కనిపిస్తాయి. వైట్ షుగర్ తినడం వలన త్వరగా బరువు పెరుగుతారు. ఇది అధిక బరువు, కొన్ని సార్లు ఊబకాయానికి కూడా దారి తీయవచ్చును. మీరు బరువు పెరుగుతున్నట్లు అనిపించినా చక్కెరను అధికంగా తీసుకోకూడదు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం రష్యా చమురు దిగుమతులపై ప్రభావం?



భారత్, అమెరికా మధ్య చాలా కాలంగా పెండిరగ్‌లో ఉన్న కీలక వాణిజ్య ఒప్పందంపై చర్చలు చివరి దశకు చేరుకున్నాయి. ఈ ఒప్పందం త్వరలో ఖరారయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ ఒప్పందం కార్యరూపం దాల్చితే భారతీయ ఉత్పత్తులపై అమెరికా ప్రస్తుతం విధిస్తున్న సుంకాలను 50 శాతం నుంచి 1516 శాతానికి గణనీయంగా తగ్గించే అవకాశం ఉందని ‘మింట్’ పత్రిక తన కథనంలో పేర్కొంది. అయితే, ఈ వాణిజ్య ఒప్పందంలో ఇంధనం, వ్యవసాయ రంగాలే అత్యంత కీలకమైన అంశాలుగా ఉన్నాయి. ఇందులో భాగంగా భారత్.. రష్యా నుంచి ప్రస్తుతం దిగుమతి చేసుకుంటున్న ముడి చమురు (క్రూడ్ ఆయిల్) పరిమాణాన్ని క్రమంగా తగ్గించుకోవాల్సి ఉంటుందని సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత ప్రధాని నరేంద్ర మోదీతో మంగళవారం ఫోన్‌లో చర్చలు జరిపారు. ఈ సంభాషణలో ప్రధానంగా వాణిజ్యం, ఇంధన అంశాలపై చర్చించినట్లు అధ్యక్షుడు ట్రంప్ స్వయంగా వెల్లడిరచారు. అంతేకాక, రష్యా నుంచి చమురు కొనుగోళ్లను పరిమితం చేస్తామని ప్రధాని మోదీ తనకు హామీ ఇచ్చారని ట్రంప్ తెలిపారు. మరోవైపు, ప్రధాని మోదీ కూడా ట్రంప్‌తో మాట్లాడినట్లు ధ్రువీకరించారు. దీపావళి శుభాకాంక్షలు తెలిపినందుకు ట్రంప్‌కు ధన్యవాదాలు తెలుపుతూ సామాజిక మాధ్యమం ‘ఎక్స్’లో పోస్ట్ చేశారు. అయితే, చర్చించిన అంశాల వివరాలను మాత్రం ఆయన వెల్లడిరచలేదు. ఈ సందర్భంగా, ఉగ్రవాదంపై పోరాటంలో రెండు దేశాలు కలిసి పనిచేయాలని మోదీ పిలుపునిచ్చారు.

ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంలో భాగంగా, అమెరికా నుంచి జన్యుమార్పిడి చేయని మొక్కజొన్న, సోయామీల్ దిగుమతులకు భారత్ అనుమతించే అవకాశం ఉందని తెలుస్తోంది. అలాగే, సుంకాలు, మార్కెట్ యాక్సెస్ వంటి అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు వీలుగా ఒక ప్రత్యేక యంత్రాంగాన్ని కూడా ఈ ఒప్పందం కింద ఏర్పాటు చేయవచ్చని సమాచారం. ప్రస్తుతం వాణిజ్య చర్చలు కీలక దశలో ఉన్నందున, ఈ నెలలో జరగనున్న ఆసియాన్ (%Aూజు Aచీ%) సదస్సులోనే ఈ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై తుది ప్రకటన వెలువడవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.


అయితే, ఈ కీలక పరిణామాలపై వ్యాఖ్యానించేందుకు భారత వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ కానీ, అమెరికా వైట్ హౌస్ కానీ వెంటనే స్పందించలేదు. రష్యా నుంచి చమురు దిగుమతులు తగ్గించుకోవాల్సిన అంశం ఈ ఒప్పందంలో భాగమైతే, అది భారతదేశ ఇంధన విధానంపై గణనీయమైన ప్రభావాన్ని చూపే అవకాశం ఉంది. మొత్తంమీద, భారత్‌అమెరికా వాణిజ్య సంబంధాలలో ఈ ఒప్పందం ఒక నూతన అధ్యాయాన్ని ప్రారంభించనుంది, దీని తుది ప్రకటన కోసం దేశ ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# బాలికపై అత్యాచారం నిందితుడికి 32 ఏళ్ల కఠిన కారాగార శిక్ష



నల్గొండ పోక్సో కోర్టు కీలక తీర్పును వెలువరించింది. మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డ కేసులో నిందితుడిగా ఉన్న గురజాల చందుకు 32 ఏళ్ల జైలు శిక్ష విధించింది. ఈ సంఘటన 2022లో జరిగింది. అప్పటికి బాధితురాలి వయసు 17 ఏళ్లు. నిందితుడు ఆమెను కిడ్నాప్ చేసి, పలు సందర్భాల్లో లైంగిక దాడికి పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. ఈ కేసు విచారణ సందర్భంగా కోర్టు ముగ్గురు కీలక సాక్షుల వాంగ్మూలాలను పరిగణనలోకి తీసుకుంది. అంతేకాకుండా, వైద్య నివేదికలు, ఇతర నిదర్శనాలను కూడా న్యాయమూర్తి రోజారమణి పరిశీలించారు. సాక్ష్యాలు, ఆధారాలను బట్టి నిందితుడి నేరం రుజువు కావడంతో ఆమె ఈ కఠిన తీర్పును ప్రకటించారు. నిందితుడైన గురజాల చందుకు 32 ఏళ్ల కారాగార శిక్షతో పాటు, రూ.75 వేల జరిమానాను కూడా కోర్టు విధించింది. శిక్షతో పాటు, బాధితురాలికి రూ.10 లక్షల పరిహారం అందించాలని కూడా న్యాయస్థానం ఆదేశించింది. ఈ పరిహారం బాధితురాలి పునరావాసానికి తోడ్పడుతుందని భావిస్తున్నారు. మైనర్ బాలికపై జరిగిన అమానుష ఘటనకు సంబంధించి నల్గొండ పోక్సో కోర్టు ఇచ్చిన ఈ తీర్పు నిందితుడికి కఠిన శిక్షను అమలు చేయడంతో పాటు, సమాజానికి గట్టి హెచ్చరికగా నిలిచింది. ఇటువంటి నేరాలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఈ తీర్పు స్పష్టం చేస్తోంది.

# బొద్దింకను చంపబోయి అగ్ని ప్రమాదం - దట్టమైన పొగతో మహిళ మృతి



దక్షిణ కొరియాలోని ఒసాన్ నగరంలో ఓ విచిత్రమైన, విషాదకరమైన సంఘటన చోటుచేసుకుంది. ఇంట్లో బొద్దింకల బెడదను తట్టుకోలేక ఓ మహిళ చేసిన పొరపాటు కారణంగా భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. బొద్దింకను చంపేందుకు ఆమె ఉపయోగించిన పద్ధతి కారణంగా ఇంట్లో మంటలు వేగంగా వ్యాపించి, దట్టమైన పొగ అలుముకుంది. ఈ దట్టమైన పొగ పక్క ఫ్లాట్‌కు వ్యాపించడంతో ఊపిరి ఆడక ఒక మహిళ దురదృష్టవశాత్తూ మరణించారు. ఈ సంఘటన ఒసాన్ నగరంలో తీవ్ర కలకలం సృష్టించింది.వివరాల్లోకి వెళితే, ఒసాన్ నగరంలోని ఒక అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే మహిళకు తన ఫ్లాట్‌లో బొద్దింకల సమస్య ఎక్కువైంది. వాటిని వదిలించుకునే ప్రయత్నంలో ఆమె అత్యంత ప్రమాదకరమైన ‘ఫ్లేమ్ థ్రోయర్’ను ఉపయోగించింది. ఇది గ్యాస్ సాయంతో మంటలను ఎగదోసే పరికరం. ఈ పరికరాన్ని ఉపయోగించి బొద్దింకలను చంపడానికి ప్రయత్నించింది. అయితే, ఆమె ప్రయత్నం బెడిసికొట్టింది. బొద్దింక చావకపోగా, మంటలు క్షణాలలోనే ఇంట్లోని వస్తువులకు అంటుకుని వేగంగా ఎగసిపడ్డాయి. ఫ్లాట్ అంతా దట్టమైన పొగతో నిండిపోయింది.

ఈ దట్టమైన పొగ పక్కనే ఉన్న ఇతర ఫ్లాట్లలోకి కూడా వ్యాపించింది. పక్క ఫ్లాట్‌లో నివసిస్తున్న చైనా దంపతులు ఈ పొగను చూసి తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మంటలు, పొగ నుంచి తప్పించుకునే ప్రయత్నంలో, ఆ దంపతులు ముందుగా తమ రెండు నెలల బిడ్డను కిటికీ గుండా పొరుగింటి వ్యక్తికి సురక్షితంగా అందించారు. ఆ తరువాత భర్త కూడా ఫ్లాట్ నుంచి బయటకు వెళ్లిపోయాడు. అయితే, పొగ తీవ్రత ఎక్కువ కావడంతో దారి సరిగా కనిపించక భార్య ఫ్లాట్‌లోనే ఉండిపోయింది. పొగకు ఊపిరి ఆడక ఆమె స్పృహ కోల్పోయింది. వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించినప్పటికీ, వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె ప్రాణాలు కోల్పోయినట్లు నిర్ధారించారు. ఈ ప్రమాదంలో మరికొంత మంది నివాసితులు కూడా అస్వస్థతకు గురయ్యారు. ఈ దుర్ఘటనకు కారణమైన మహిళపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఒక బొద్దింకను చంపేందుకు చేసిన ప్రయత్నం కారణంగా ఒక అమాయకురాలైన మహిళ ప్రాణాలు కోల్పోవడం ఒసాన్ నగరంలో విషాదాన్ని నింపింది.

# బంగారు పతక విజేత నీరజ్ చోప్రాకు గౌరవ లెఫ్టినెంట్ కల్నల్ హోదా



రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత, భారతదేశపు అత్యుత్తమ క్రీడాకారుడు అయిన నీరజ్ చోప్రాకు అరుదైన గౌరవం దక్కింది. భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ బుధవారం నీరజ్ చోప్రాకు టెరిటోరియల్ ఆర్మీ (ప్రాదేశిక సైన్యం)లో గౌరవ లెఫ్టినెంట్ కల్నల్ హోదా చిహ్నాన్ని ప్రదానం చేశారు. ఈ విషయాన్ని రక్షణ మంత్రి స్వయంగా తన సోషల్ మీడియా వేదిక ‘ఎక్స్’ (గతంలో ట్విట్టర్) ద్వారా తెలియజేశారు. క్రీడా రంగంలో నీరజ్ చోప్రా చేసిన కృషికి, దేశానికి తెచ్చిన ఖ్యాతికి గుర్తింపుగా ఈ గౌరవాన్ని అందించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నీరజ్ చోప్రాను అభినందిస్తూ, ఆయనను పట్టుదల, దేశభక్తి మరియు శ్రేష్ఠత కోసం కృషి చేయాలనే భారతీయ స్ఫూర్తికి ప్రతీకగా అభివర్ణించారు. నీరజ్ చోప్రా అసాధారణమైన క్రీడా నైపుణ్యాన్ని, దేశం పట్ల ఆయనకున్న నిబద్ధతను ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. భవిష్యత్తులో నీరజ్ చేపట్టబోయే అన్ని ప్రయత్నాలలో విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నట్లు రక్షణ మంత్రి తమ సందేశంలో పేర్కొన్నారు. సాధారణంగా, క్రీడలు, కళలు మరియు ఇతర రంగాలలో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులకు సైన్యం గౌరవ హోదాలను ప్రదానం చేయడం పరిపాటి. ఈ గౌరవం పౌరులు మరియు సైన్యం మధ్య బంధాన్ని బలోపేతం చేయడంతో పాటు, ఇతర యువకులకు కూడా దేశం కోసం ఏదైనా చేయాలనే స్ఫూర్తిని అందిస్తుంది. నీరజ్ చోప్రాకు లెఫ్టినెంట్ కల్నల్ హోదా లభించడం ఆయన క్రీడా విజయాలకు లభించిన మరో ఘనమైన గుర్తింపుగా నిలిచింది. ప్రస్తుతం నీరజ్ చోప్రా అంతర్జాతీయ అథ్లెటిక్స్‌లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ, జావెలిన్ త్రో విభాగంలో ప్రపంచ రికార్డులు సృష్టిస్తున్నారు. టోక్యో ఒలింపిక్స్ 2020లో బంగారు పతకం మరియు పారిస్ ఒలింపిక్స్ 2024లో రజత పతకం సహా అనేక అంతర్జాతీయ పోటీల్లో ఆయన పతకాలు సాధించారు. ఈ గౌరవ లెఫ్టినెంట్ కల్నల్ హోదా ఆయన దేశ సేవ పట్ల ఉన్న అంకితభావాన్ని, క్రీడా విజయాలను మరింత పెంచే విధంగా ఉంది.

# నటుడు విజయ్‌కు ఏఐఏడీఎంకే సలహా

- విజయ్‌కు అన్నాడీఎంకే సీనియర్ నేత సూచన
- అవినీతి డీఎంకేను గద్దె దించడమే లక్ష్యం
- ఒంటరి పోరాటం చేస్తే పార్టీకి మనుగడ కష్టం



తమిళనాడు రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ప్రముఖ నటుడు విజయ్‌కు (నటుడు) అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి ఆర్‌బీ ఉదయ కుమార్ కీలక సలహాలు ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో మెగాస్టార్ చిరంజీవి చేసిన రాజకీయ పొరపాటును నటుడు విజయ్ పునరావృతం చేయవద్దని ఉదయ్‌కుమార్ హితవు పలికారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ తరహాలో సరైన సమయంలో పొత్తుల విషయంలో తెలివైన నిర్ణయం తీసుకోవాలని ఆయన సూచించారు. అన్నాడీఎంకే కూటమిలో చేరకపోతే విజయ్ పార్టీ అయిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) రాజకీయంగా కనుమరుగవడం ఖాయమని ఉదయ్‌కుమార్ హెచ్చరించారు.

మధురైలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆర్‌బీ ఉదయకుమార్ మీడియాతో మాట్లాడారు. వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో అవినీతి డీఎంకే ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా తాము భారతీయ జనతా పార్టీ (బీజేపీ)తో పొత్తు పెట్టుకున్నామని ఆయన తెలిపారు. ఈ కూటమిలో చేరడానికి మరిన్ని పార్టీలు సిద్ధంగా ఉన్నాయని వెల్లడిరచిన ఆయన, ఇదే సరైన సమయం కాబట్టి నటుడు విజయ్ కూడా తమతో కలవాలని బహిరంగంగా ఆహ్వానించారు. అన్నాడీఎంకే మెగా కూటమిలో టీవీకే చేరడానికి ఇదే అత్యంత సరైన సమయమని, విజయ్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

తమ కూటమిలో చేరకపోతే ఎన్నికల తర్వాత డీఎంకే పార్టీని నాశనం చేస్తుందని ఉదయ్‌కుమార్ జోస్యం చెప్పారు. అంతేకాక, టీవీకే పార్టీ ఒంటరిగా ఎన్నికల బరిలో దిగితే ఆ పార్టీ అడ్రస్ లేకుండా పోతుందని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ పరిణామాలను ఉదహరించారు. ఆంధ్రప్రదేశ్‌లో మెగాస్టార్ చిరంజీవి పార్టీ పెట్టినప్పుడు పొత్తులపై సరైన నిర్ణయం తీసుకోలేకపోయారని, దాని ఫలితంగా ఆయన పార్టీ రాజకీయంగా బలహీనపడిరదని పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ నిర్ణయాన్ని గుర్తు చేసుకో అయితే, పవన్ కల్యాణ్ సరైన సమయంలో, సరైన పొత్తు నిర్ణయం తీసుకోవడం ద్వారా తన పార్టీని నిలబెట్టుకోవడమే కాకుండా, రాష్ట్రానికి ఉపముఖ్యమంత్రి అయ్యారని ఉదయ్‌కుమార్ గుర్తు చేశారు. పవన్ కల్యాణ్ తెలివైన రాజకీయ వ్యూహాన్ని విజయ్ అనుసరించాలని ఆయన పరోక్షంగా సలహా ఇచ్చారు. తన మాటలను నటుడు విజయ్ గుర్తుపెట్టుకోవాలని, ఒకవేళ డీఎంకే మళ్లీ అధికారంలోకి వస్తే విజయ్‌ను దేవుడు కూడా కాపాడలేడని ఉదయ్‌కుమార్ వ్యాఖ్యానించారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in